RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY నిజం మా విజన్ 18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:72 TUESDAY,11 AUGUST ,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :72 మంగళవారం,ఆగష్టు 11, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



# వర్షాల కోసం వరుణ యాగం



## తెలంగాణలో వర్షాల కోసం ప్రభుత్వం మహా వరుణ యాగం

నాగార్జున సాగర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల పూజలు

ఎల్ నినో ప్రభావం, తగ్గిన జలమట్టాల నేపథ్యంలో ప్రత్యేక క్రతువు

యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో యాగం

తెలంగాణ పత్రిక :రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ వేదికగా ఈ క్రతువును శాస్త్రోక్తంగా మిగతా2లో



## పొంగులేటి వర్సెస్ కౌశిక్ రెడ్డి

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ

హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో ఉద్రిక్తత

మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాగ్వాదం

గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో వేదికపైనే అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే

ప్రభుత్వ వేదికపై రాజకీయాలు వద్దంటూ మంత్రులకు హితవు 2

ఇరువర్గాల నినాదాలతో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు

## విద్యార్థులపై పోలీసుల చర్యపై పార్లమెంట్‌లో మాట్లాడనున్న అమిత్ షా



2

- ఈ అంశంపై పూర్తిస్థాయి చర్చకు సిద్ధమైనట్లు ప్రభుత్వం ప్రకటన
- ప్రతిపక్షాలు గందరగోళం చేయొద్దని రిజిజు విజ్ఞప్తి
- జూన్ 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసన
- వారిపై పోలీసుల చర్యలను తీవ్రంగా తప్పుబట్టిన ప్రతిపక్షాలు

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు జాతీయ హోదాపై కేంద్రం క్లారిటీ..




తెలంగాణ పత్రిక : తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చే అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని జలశక్తి శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మిగతా2లో



## 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలి

'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలి..-స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేయాలి..

వివరాలు2లో



## బండి సంజయ్ బతుకంతా మత రాజకీయమే

- బోనాల పండుగలను బీజేపీ నేతలు రాజకీయాలకు వాడుకుంటున్నారన్న ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని వ్యాఖ్య
- మహంకాళి అమ్మవారికి రేవంత్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారన్న శ్రీనివాస్

2

కేంద్ర మంత్రి బండి సంజయ్ బతుకంతా మతం పేరు చెప్పుకుని రాజకీయం చేయడమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విమర్శించారు.

## ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు

### పెద్ది సుదర్శన్ రెడ్డి



దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి కేటీఆర్ నివాళి

పెద్ది కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ

ప్రజల హృదయాల్లో పెద్ది చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడిన కేటీఆర్

తెలంగాణ పత్రిక : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన 2లో




## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ..

తెలంగాణ పత్రిక :తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెల్పారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచా రం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ మిగతా2లో

## రష్యా నుంచి భారత్‌కు రైల్వే మార్గం..

### సముద్ర మార్గాలకు ప్రత్యామ్నాయంగా భారీ ప్లాన్!




తెలంగాణ పత్రిక ప్రతినిధి: ప్రపంచంలోని కీలక సముద్ర మార్గాల్లో భద్రతా సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో రష్యా కీలక ప్రతిపాదన చేసింది. తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్తాన్, పాకిస్థాన్ మీదుగా భారత్‌కు రైల్వే మార్గాన్ని అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని రష్యా భావిస్తోంది. ఈ ప్రాజెక్టు అమలైతే భారత్-రష్యా వాణిజ్యానికి సముద్ర మార్గాలకు ప్రత్యామ్నాయంగా కొత్త భూభాగ రవాణా మార్గం అందుబా టులోకి రావచ్చు. ప్రపంచవ్యాప్త ంగా కీలకమైన సముద్ర మార్గాల్లో భద్రతా సమస్యలు పెరుగుతున్న నేపథ్య ంలో రష్యా కీలక ప్రతిపాదనను తెరపైకి తీసుకొ చ్చింది. భారత్‌తో భూభాగం మీదుగా నేరుగా అనుసంధానమయ్యే రైల్వే మార్గాన్ని అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని రష్యా భావిస్తోంది. ఈ రైల్వే కారిడార్ ద్వారా రష్యా మిగతా2లో

## కోటి మందికిపైగా స్మార్ట్ రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. 2



## హైదరాబాద్ వాసులకు గుడ్‌న్యూస్

- హైదరాబాద్‌లో జనన, మరణాల నమోదుకు కొత్త ఆన్‌లైన్ పోర్టల్
- కొత్త పోర్టల్‌పై అధికారులతో జీహెచ్ఎంసీ కమిషనర్ సమీక్ష
- కఠినంగా మారిన జనన, మరణాల నమోదు సవరణ చట్టం-2026

2

# వర్షాల కోసం వరుణ యాగం..

యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా ఉండటం, ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ యాగానికి శ్రీకారం చుట్టింది. ఉదయం నుంచి సాగిన ఈ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 108 మంది రుత్విక్కులు, వేద పండితుల పర్యవేక్షణలో 11 హోమ గుండాలతో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, కేవలం 145.65 టీఎంసీల మేర మాత్రమే నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం ఇది సుమారు 518 అడుగుల వద్దే కొనసాగుతోంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయం నిండుకుండలా ఉందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు నిండి అన్నదాతల పంటలు పచ్చగా ఉండాలన్న సంకల్పంతో ఈ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

# రష్యా నుంచి భారత్‌కు రైల్వే మార్గం..

ఈ రైల్వే కారిడార్ ద్వారా రష్యా నుంచి మధ్య ఆసియా, దక్షిణాసియా మీదుగా భారత్‌కు, అక్కడి నుంచి హిందూ మహాసముద్రానికి చేరుకునే అవకాశం ఏర్పడవచ్చు. ఈ ప్రతిపాదన అమలులోకి వస్తే రష్యా-భారత్ మధ్య వాణిజ్యానికి కొత్త మార్గం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా సముద్ర రవాణాకు అంతరాయం ఏర్పడిన సమయంలో సరుకు రవాణాకు ఈ భూభాగ మార్గం ప్రత్యామ్నాయంగా ఉపయోగపడే అవకాశం ఉందిరష్యా ఏం ప్రతిపాదించింది? రష్యా ఉప ప్రధాని మారత్ ఖుస్నుల్లిన్ ఈ ప్రతిపాదనపై మాట్లాడారు. రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ టాస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కీలక సముద్ర మార్గాల్లో ఉన్న ప్రమాదాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బోస్ఫరస్, హార్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాలకు సంబంధించిన భద్రతా సమస్యల కారణంగా ఇతర మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్తాన్, పాకిస్థాన్ మీదుగా వెళ్లే మార్గాలను ప్రత్యామ్నాయాలుగా పరిశీలించవచ్చని, భారత్‌కు చేరుకునే ఆచరణాత్మక మార్గం ఏదైనా తమకు ఆమోదయోగ్యమేనని ఆయన వెల్లడించారు.ప్రస్తుతం ఇది కేవలం ప్రతిపాదన దశలోనే ఉంది. ఈ మార్గంలో అనేక దేశాలు, సుదీర్ఘ రైల్వే మార్గాలు, క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు ఉండటంతో దీన్ని అమలు చేయడం అంత సులభం కాదుభారత్‌కు ఎలా చేరుకుంటుంది? ప్రతిపాదిత రైల్వే కారిడార్ రష్యా నుంచి ప్రారంభమై తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్ మీదుగా అఫ్గానిస్తాన్, పాకిస్థాన్ దాటి భారత్‌కు చేరుకునే అవకాశం ఉంది. ఈ మార్గం అభివృద్ధి చెందితే రష్యాకు మధ్య ఆసియా, దక్షిణాసియా మీదుగా భారత మార్కెట్‌కు భూభాగ మార్గం లభిస్తుంది. అంతేకాకుండా భారత్ ద్వారా హిందూ మహాసముద్రానికి కూడా అనుసంధానం ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇప్పటికే రష్యా-భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు బలంగా ఉన్నాయి. కొత్త రైల్వే మార్గం అందుబాటులోకి వస్తే ఇరు దేశాల మధ్య సరుకు రవాణా మరింత వేగవంతం కావడంతో పాటు సముద్ర మార్గాలపై ఆధారపడటం కొంతవరకు తగ్గే అవకాశం ఉంది.

**సముద్ర మార్గాలకు ఎందుకు ప్రత్యామ్నాయం?**

ప్రపంచ వాణిజ్యంలో సముద్ర మార్గాలకు ఎంతో కీలకమైన స్థానం ఉంది. అయితే ఇటీవలి కాలంలో కొన్ని కీలక జలమార్గాల్లో భద్రతా సమస్యలు పెరిగాయి. బోస్ఫరస్ జలసంధి నల్ల సముద్రాన్ని మధ్యధరా సముద్రంతో కలుపుతుంది. మరోవైపు హార్ముజ్ జలసంధి పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు, ఇతర ఇంధన వనరుల రవాణాకు అత్యంత కీలకమైన మార్గం. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, సైనిక ఘర్షణలు, నౌకల భద్రతపై ఆందోళనలు అంతర్జాతీయ సరుకు రవాణాపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సముద్ర రవాణాకు ప్రత్యామ్నాయంగా భూభాగ మార్గాలను అభివృద్ధి చేయడంపై పలు దేశాలు దృష్టి సారిస్తున్నాయి.రైల్వే మార్గం వల్ల ప్రయోజనం ఏమిటి? సముద్ర మార్గాల్లో అంతరాయం ఏర్పడినప్పుడు రైల్వే కారిడార్ ద్వారా సరుకులను రష్యా నుంచి భారత్‌కు తరలించే అవకాశం ఉంటుంది. సైనిక ఉద్రిక్తతలు, సముద్ర దిగ్బంధనాలు, దోపిడీలు లేదా ఇతర కారణాలతో నౌకల రాకపోకలు ఆలస్యమైనప్పుడు రైల్వే మార్గం ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. అయితే ఈ ప్రాజెక్టుకు అనేక సవాళ్లు కూడా ఉన్నాయి. ప్రతిపాదిత మార్గం అనేక దేశాల మీదుగా సాగాల్సి ఉంటుంది. ప్రతి దేశానికి వేర్వేరు రైల్వే వ్యవస్థలు, సరిహద్దు నిబంధనలు, కస్టమ్స్ విధానాలు, భద్రతా పరిస్థితులు ఉన్నాయి. అందువల్ల ఈ ప్రాజెక్టును అమలు చేయాలంటే సంబంధిత దేశాల మధ్య విస్తృత స్థాయిలో ఒప్పందాలు కుదరాల్సి ఉంటుంది. భారీ స్థాయిలో రైల్వే మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో రైలు కనెక్టివిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

**భారత్-రష్యా వాణిజ్యానికి కొత్త దారి?**

ఈ ప్రతిపాదన ఆచరణలోకి వస్తే రష్యా-భారత్ వాణిజ్యానికి మరో ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి రావచ్చు. ముఖ్యంగా సముద్ర మార్గాల్లో సమస్యలు తలెత్తిన సమయంలో ఈ భూభాగ రైల్వే కారిడార్ కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే రష్యా నుంచి భారత్‌కు తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్గానిస్తాన్, పాకిస్థాన్ మీదుగా రైల్వే మార్గాన్ని నిర్మించడం సాంకేతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అత్యంత క్లిష్టమైన పని. అందువల్ల ఈ ప్రతిపాదన వాస్తవ రూపం దాల్చడానికి ప్రస్తుతం రష్యా ప్రత్యామ్నాయ మార్గాలపై ఆలోచన చేస్తుండగా.. ఈ ప్రతిపాదిత రైల్వే కారిడార్ భవిష్యత్తులో భారత్-రష్యా వాణిజ్యానికి కొత్త దారిగా మారుతుందా అనేది ఆసక్తికరంగా మారింది.

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు జాతీయ హోదాపై కేంద్రం క్లారిటీ..

కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర జల వివాదాలు కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 పరిధిలో న్యాయ విచారణలో ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. ఈ అంశాలు పరిష్కారం కాకుండా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి టెక్నో-ఎకనామిక్ అప్రైజల్ చేపట్టడం సాధ్యం కాదని పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కేంద్రం తిరిగి రాష్ట్రానికి పంపినట్లు మంత్రి వెల్లడించారు. ప్రాజెక్టు సమగ్ర ప్రణాళికకు అవసరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని డీపీఆర్‌ను పునఃసమీక్షించి సమర్పించాల్సిందిగా సూచించినట్లు తెలిపారు. జాతీయ హోదాపై ఎదురుచూపులు.. కాగా, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం చాలాకాలంగా కోరుతోంది. అయితే ప్రస్తుతం ఈ ప్రతిపాదన కేంద్ర పరిశీలనలో లేదని తాజా సమాధానంతో స్పష్టమైంది. మరోవైపు కృష్ణా జలాల పంపకాలు, అంతర్రాష్ట్ర వివాదాలు ట్రైబ్యునల్ పరిధిలో ఉండటంతో ప్రాజెక్టు అంశంలో ముందడుగు వేసే పరిస్థితి లేదని కేంద్రం తేల్చిచెప్పింది. దీంతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశంపై తెలంగాణ ప్రభుత్వానికి మరోసారి నిరాశ ఎదురైనట్లయింది.

# హైదరాబాద్ వాసులకు గుడ్‌న్యూస్

జనన, మరణ ధ్రువపత్రాల జారీలో జాప్యాన్ని నివారించి, ఆ ప్రక్రియను మరింత సరళతరం చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సిద్ధమవుతోంది. నగరవాసుల సౌకర్యార్థం 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్' (సీఆర్ఎస్) పేరుతో సరికొత్త ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తోంది. దీని ద్వారా ప్రజలు ఆన్‌లైన్‌లోనే జనన, మరణాలను సులువుగా నమోదు చేసుకుని, వేగంగా ధ్రువపత్రాలను పొందే వీలుంటుంది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇటీవల అధికారులతో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. జనన, మరణాల నమోదు, సకాలంలో ధ్రువపత్రాల జారీ అనేది జీహెచ్ఎంసీ ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. రాబోయే కొత్త పోర్టల్ పనితీరుతో పాటు జనన, మరణాల నమోదు చట్టంపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నూతన డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల పార్లమెంట్ ఆమోదించి, రాష్ట్రపతి సంతకంతో అమల్లోకి వచ్చిన జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం-2026 నేపథ్యంలో జీహెచ్ఎంసీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. నూతన చట్టం ప్రకారం, జనన లేదా మరణాల నమోదులో జాప్యం జరిగితే కఠినమైన నిబంధనలు వర్తిస్తాయి.

## 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలి

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని బండి సంజయ్ హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద జాతీయ జెండాను సోమవారం ఎగురవేశారు. అనంతరం పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాకు బండి సంజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు.

**'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలి..**

దేశవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాలను చేపడుతున్నట్లు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఈరోజు నుంచి 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో 'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలని బీజేపీ శ్రేణులను బండి సంజయ్ కోరారు. కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్దఎత్తున భాగస్వామ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశంపై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు.

**స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేయాలి..**

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందుగా, ఆగస్టు 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మహాపురుషులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేసి, స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ శ్రేణులను బండి సంజయ్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి ప్రదర్శనలు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే ఒక గొప్ప సామాజిక ఉద్యమంగా ఈ కార్యక్రమం రూపాంతరం చెందిందని తెలిపారు. ప్రతి ఏడాది ఇది ఘనంగా జరుగుతోందని గుర్తుచేశారు. 'మన జాతీయ త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరి ఐక్యతకు, సమైక్యతకు, అఖండతకు ప్రతీక అని వెల్లడించారు. ప్రతి ఇంటా దేశభక్తి వాతావరణం పరిమళించేలా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా చూసి 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌ను విజయవంతం చేయాలని బండి సంజయ్ కోరారు.

## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ..

తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

## పొంగులేటి వర్సెస్ కౌశిక్ రెడ్డి

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రుల ప్రసంగాలపై స్థానిక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ నిమిత్తం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తోందని వారు పేర్కొన్నారు.దమంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఈ ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమని, మంత్రులు వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "అబద్ధాలు చెప్పవద్దు.. కేవలం నిజాలే మాట్లాడండి. ఇది రాజకీయాలు చేసే వేదిక కాదు, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన చోటు" అని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని మంత్రులపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తలు, మద్దతుదారులు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలను అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## విద్యార్థులపై పోలీసుల చర్యపై పార్లమెంట్‌లో మాట్లాడనున్న అమిత్ షా

ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్యలపై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సమాధానం ఇవ్వనున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం పూర్తిస్థాయి చర్చకు సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సోమవారం ప్రకటించారు. దీంతో కొన్నిరోజులుగా కొనసాగుతున్న పార్లమెంట్ ప్రతిష్ఠంభనకు తెరపడే అవకాశం కనిపిస్తోంది. విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రిజిజు తెలిపారు. ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశానికీ ప్రభుత్వం సమాధానం ఇస్తుందని చెప్పారు. ముఖ్యంగా హోంమంత్రి అమిత్ షా సభలో ఈ అంశంపై స్పందిస్తారని స్పష్టం చేశారు. అయితే అమిత్ షా ప్రకటన సమయంలో ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించకూడదని రిజిజు కోరారు. హోంమంత్రి సమాధానాన్ని పూర్తిగా వినాలని సూచించారు. చర్చ మొదలైన తర్వాత ప్రతి అంశంపైనా విస్తృతంగా మాట్లాడవచ్చని చెప్పారు.

## బండి సంజయ్ బతుకంతా మత రాజకీయమే

కేంద్ర మంత్రి బండి సంజయ్ బతుకంతా మతం పేరు చెప్పుకుని రాజకీయం చేయడమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను కూడా బీజేపీ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సరికాదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండుగను ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించిందని, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారని గుర్తుచేశారు. బోనాల ఏర్పాట్లపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవించే లౌకిక ప్రభుత్వమని స్పష్టం చేశారు. హిందూ ధర్మాన్ని, ప్రాచీన ఆలయాలను కాపాడేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ పునర్నిర్మాణానికి రూ.250 కోట్లు, బాసరకు రూ.225 కోట్లు, భద్రాచలానికి రూ.351 కోట్లు, గోదావరి పుష్కరాల అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించామని వివరించారు. అలాగే మొయినాబాద్, వేములవాడలలో రూ.197 కోట్లతో ఆధునిక గోశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆలయాల అభివృద్ధికి ఇంత భారీగా నిధులు కేటాయించారా? అని ప్రశ్నించిన ఆయన.. సంజయ్‌కి చేతనైతే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు.

## ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపించిన గొప్ప నాయకుడు పెద్ది అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం కాదు, ఎలా జీవించామన్నదే ప్రధానం. పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక్క పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారు" అని వ్యాఖ్యానించారు. ఆయన అంత్యక్రియలకు పోటెత్తిన అశేష జనవాహిని, ప్రజల్లో ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సుదర్శన్ రెడ్డి, జులై 31న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గతంలో జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్‌గా సేవలందించడంతో పాటు, 2018-2023 మధ్య కాలంలో నర్సంపేట ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు. కాగా, నిన్న ఆదివారం నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో పార్టీ తరఫున ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల పేరున ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున, ఆయన తల్లి సంక్షేమం కోసం రూ. 25 లక్షలను కేటాయించారు.

## కోటి మందికిపైగా స్మార్ట్ రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నాం

ఈ సందర్భంగా సోమవారం తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# వంశ ప్రతిష్ఠను పక్కనపెట్టి.. భక్తి చాటిన సురభి కుటుంబం

-బోనం ఎత్తిన సురభి కుటుంబ ఆడపడుచులు.. కొమురం భీమ్ కాలనీ పోచమ్మ దేవాలయానికి కొత్త వైభవం

-దైవం ముందు కులాలు లేవు.. అందరూ సమానమే' అంటూ సమానత్వ సందేశం

-సంగారెడ్డి జిల్లా, పటాన్చెరు నియోజకవర్గం





తెల్లాపూర్, ఆగస్టు 10, (తెలంగాణ పత్రిక)

ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు తెల్లాపూర్ గ్రామంలోని కొమురం భీమ్ కాలనీలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురభి కుటుంబానికి చెందిన ఆడపడుచులు బోనమెత్తి అమ్మవారికి సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమ కుటుంబ వంశ ప్రతిష్ఠను పక్కనపెట్టి, భక్తి ముందు అందరూ సమానమేనని చాటి చెప్పిన సురభి కుటుంబ సభ్యుల తీరు స్థానికంగా ప్రశంసలు అందుకుంది. తెల్లాపూర్‌లోని కొమురం భీమ్ కాలనీ పోచమ్మ దేవాలయంలో జరిగిన బోనాల వేడుకల్లో సురభి కుటుంబ ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా బోనమెత్తి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ దైవం ముందు సమానమేనని, భక్తికి కులాలు, వర్గాలు, అంతస్తులు అడ్డంకులు కావని వారు తమ ఆచరణ ద్వారా చాటి చెప్పారు.

**వంశ ప్రతిష్ఠ కంటే భక్తే గొప్పది**

పాలమూరు ప్రాంతానికి చెందిన జమీందారీ వంశ నేపథ్యం కలిగిన సురభి కుటుంబ సభ్యులు ప్రస్తుతం తెల్లాపూర్‌లోని కొమురం భీమ్ కాలనీలో నివసిస్తున్నారు. తమ కుటుంబ సంప్రదాయాల్లో మహిళలు బోనం ఎత్తే ఆచారం పెద్దగా లేకపోయినా.. ఈసారి ఆ సంప్రదాయ పరిమితులను పక్కనపెట్టి సురభి కుటుంబ ఆడపడుచులు స్వయంగా బోనం ఎత్తి అమ్మవారికి సమర్పించారు. 'దైవం ముందు మనమంతా సమానమే.. భక్తికి కులాలు లేవు' అనే సందేశాన్ని తమ ఆచరణ ద్వారా సమాజానికి అందించారు. వంశ ప్రతిష్ఠ, హోదా, అంతస్తులకంటే భక్తి, మానవత్వం, సమానత్వమే ముఖ్యమని చాటి చెప్పారు.

**తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు**

ఆషాఢ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని సురభి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మన దైవం.. మన గుడి అనే ఆత్మీయత ప్రతి కాలనీ వాసిలో పెరగాలని, ప్రతి ఒక్కరూ తమ ప్రాంతంలోని దేవాలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని వారు పిలుపునిచ్చారు. దేవాలయాలు కేవలం పూజా స్థలాలే కాకుండా.. ప్రజలను ఐక్యం చేసే ఆధ్యాత్మిక, సామాజిక కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బోనాల వంటి తెలంగాణ సంప్రదాయ పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, వాటి ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం, సమానత్వాన్ని పెంపొందించాలని కోరారు. సురభి కుటుంబ ఆడపడుచులు బోనం ఎత్తిన దృశ్యం కొమురం భీమ్ కాలనీ బోనాల వేడుకలకు ప్రత్యేక వైభవాన్ని తీసుకురావడమే కాకుండా. దైవం ముందు అందరూ సమానమే'అనే గొప్ప సందేశాన్ని సమాజానికి అందించింది..

# జనసేన పార్టీ కార్యాలయం ఏర్పాటుకు కార్యాచరణ

-భారీ బహిరంగా సభకు సిద్ధం



జగిత్యాల, ఆగస్టు 10 (తెలంగాణ పత్రిక:

జగిత్యాల నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యాలయం ఏర్పాటుకు భవిష్యత్తు కార్యాచరణపై జనసేన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ తళ్లూరి ని జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ బెక్కం జనార్దన్ కలవడం జరిగింది. జగిత్యాల గడ్డపై జనసేన పార్టీ ఆఫీసు ఏర్పాటుకు రామ్ తాళ్లూరి సానుకూలంగా స్పందించారని జనార్దన్ తెలిపారు. త్వరలోనే జగిత్యాలలో జనసేన పార్టీ భారీ బహిరంగ సభను కూడ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక తయారు చేస్తున్నామని జగిత్యాల గడ్డపై జనసేన జెండాను పెద్ద ఎత్తున ఎగరేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. జనసేన పార్టీ నాయకులు వెంకటేష్ కళ్యాణ్ సంకీర్తన్ అజయ్ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

# మోడీ విధానాలపై కార్మిక, కర్షకుల కదనభేరి

-దమ్మపేటలో విజయవంతమైన జైల్‌భరో.. జయలక్ష్మి థియేటర్ సెంటర్‌లో రాస్తారోకో



తెలంగాణ పత్రిక దమ్మపేట ఆగస్టు 10

దమ్మపేట: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ దమ్మపేట మండలంలో నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమం విజయవంతమైంది. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జయలక్ష్మి థియేటర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు అధ్యక్షతన జరిగిన సభలో ఎస్‌కేఎం జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ లక్ష్మీనారాయణ, మాస్‌లైన్ నాయకులు పందూరు వీరబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, మతోన్మాద విధానాల కారణంగా సామాన్య ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని విమర్శించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విధానాలను మార్చుకోకపోతే కార్మికులు, రైతులు, కష్టజీవులు ఐక్యంగా ఉద్యమించి మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, సీఐటీయూ మండల నాయకులు కవులూరి రామకృష్ణ, శారద, రజని, శ్రీలత, జ్యోతి, సత్యవతి, జయ, విజయలక్ష్మి, రామలక్ష్మి, వజ్రమ్మ, బత్తుల శ్రీను, రైతు సంఘం నాయకులు కేశవరావు, అప్పారావు, పిల్లి నాయుడు, శోభన్ బాబు, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు .

# తెలంగాణ గౌడ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కొమిరె వెంకటసాయి గౌడ్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ గౌడ యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన కొమిరె వెంకటసాయి గౌడ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు సందీప్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కొమిరె వెంకటసాయి గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు సందీప్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గౌడ యువజన సంఘం అభివృద్ధికి, గౌడ యువత సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# హర్ ఘర్ తిరంగా ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలి

-బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్ పిలుపు

జగిత్యాల టౌన్, ఆగస్టు 10 (తెలంగాణ పత్రిక):



భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారతీయ జనత పార్టీ దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి వందనం నిర్వహించారు. ఈ సందర్భంగా నారపాక అశోక్ మాట్లాడుతూ దేశమంత ఒకటే పండుగ ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి అనే స్ఫూర్తితో ప్రతి భారతీయుడు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 10 వ తేదీ నుంచి ఆగస్టు 15 వ తేదీ వరకు ప్రతి ఇంటిపై మన జాతీయ మువ్వన్నెల జెండాను గర్వంగా ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# విజెందర్ కు పూర్వ విద్యార్థుల పరామర్శ

-సముద్రాల మొగిలి మృతి పట్ల సంతాపం





ఆత్మకూర్, ఆగస్టు 10 (తెలంగాణ పత్రిక):

వరంగల్ వాయిస్ సీనియర్ రిపోర్టర్ సముద్రాల విజేందర్ తండ్రి సముద్రాల మొగిలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో 1986 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. విజేందర్ కుటుంబ సభ్యులను ఓదార్చి, మొగిలి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ సముద్రాల మొగిలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అదేవిధంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కూడా సముద్రాల విజేందర్ కుటుంబాన్ని సందర్శించి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, మొగిలి మృతికి సంతాపం తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెలిదె లక్ష్మణ్, కొండబత్తుల వేణుగోపాల్, జి. దామోదర్, బీరం రాజిరెడ్డి, కొత్త కర్ణాకర్ రెడ్డి, తోట చంద్రశేఖర్, టి సంపత్, ఈ.తిరుపతి రెడ్డి, యు .రవి, బి రమేష్ , జీ రమేష్, ఏ. మహేందర్ ,వి. విద్యాసాగర్, ఏం. సతీష్, పి. మల్లారెడ్డి, నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు సింగారం శ్యామ్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నీరుకుళ్లలో కోతుల బీభత్సం వ్యక్తిపై దాడి.. మెడపై కొరికి, గోళ్లతో గాయపరిచిన కోతులు

-గ్రామంలో రోజురోజుకూ పెరుగుతున్న బెడద.. తక్షణ చర్యలు చేపట్టాలన్నా గ్రామస్థులు

ఆత్మకూర్, ఆగస్టు 10 (తెలంగాణ పత్రిక):

ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఇళ్ల పరిసరాల్లోకి గుంపులుగా ప్రవేశిస్తున్న కోతులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండగా, తాజాగా ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన గ్రామంలో కలకలం రేపింది. దీంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

**ఇంటి వద్దకు వచ్చిన కోతుల మంద**

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నీరుకుళ్ల గ్రామానికి చెందిన భూసాలి శ్రీను ఇంటి వద్దకు కోతుల మంద వచ్చింది. వాటిని గమనించిన శ్రీను కర్రతో కోతులను తరిమేందుకు ప్రయత్నించాడు. దీంతో ఒక్కసారిగా కోతులు శ్రీనుపై తిరగబడి దాడి చేశాయి. తీవ్ర ఆగ్రహంతో ఓ కోతి శ్రీను మెడపై కొరకడంతో పాటు గోళ్లతో గీరడంతో తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. శ్రీను కేకలు వేయడంతో అప్రమత్తమైన చుట్టుపక్కల వారు వెంటనే అక్కడికి చేరుకుని కోతులను తరిమికొట్టారు. అనంతరం తీవ్రంగా



గాయపడిన శ్రీనును చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు నీరుకుళ్ల గ్రామంలో గత కొంతకాలంగా కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఇళ్లపైకి, ఇంటి ఆవరణల్లోకి, వీధుల్లోకి గుంపులుగా వస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. తాజాగా వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనతోనైనా అటవీ శాఖ అధికారులు, తక్షణమే గ్రామాన్ని సందర్శించి కోతుల బెడదను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కోతులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. మరోసారి ఇలాంటి దాడులు జరిగి ప్రాణనష్టం సంభవించకముందే ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని నీరుకుళ్ల గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఓబీసీ నేతలను మర్యాదపూర్వకంగా కలిసిన లక్ష్మణ్



**తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 10:**
జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జేకే శేఖర్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్ రావుల శేషగిరిని ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురినీ శాలువాలతో సత్కరించి, పరస్పరం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జేకే శేఖర్ యాదవ్, రావుల శేషగిరి లక్ష్మణ్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం ఓబీసీ మోర్చా కార్యకలాపాలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై వారు చర్చించారు.

# రోడ్డెక్కిన మిషన్ భగీరథ

**-పైపులున్నాయి నల్లాలు లేవు రోడ్డుపై వృధాగా నీరు**

**ఆళ్లపల్లి ఆగస్టు 10 (తెలంగాణ పత్రిక):**



మండలంలోని రాయపాడు పంచాయతి ముత్తాపురం గ్రామంలో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం ముత్తపురం గ్రామంలో అసంపూర్తిగా మిగిలిపోయింది.గ్రామంలో కొన్ని నెలల క్రితం పైపులైన్ పనులు పూర్తయ్యాయి. కానీ ఇంటింటికీ ఇవ్వాల్సిన నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. ఫలితంగా పైపుల లీకేజీల నుంచి వచ్చే నీరు రోడ్డుపై వృధాగా పారుతోంది.పైపులు వేసిన చోట్ల రోడ్లు అన్నీ గుంతలు పడ్డాయి. వర్షం పడితే బురద ఎండకు దుమ్ము ఒకవైపు గ్రామస్తులు తాగునీటి కోసం కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. మరోవైపు వేల లీటర్ల నీరు రోడ్డుపై వృధాగా పోతోంది నల్లాలు పెట్టలేదు. ఇప్పుడు లీక్ అయిన నీళ్లను కూడా ఆపడం లేదు అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల దాహం తీర్చాల్సిన పథకం ఇలా వృధాకు దారితీయడం సరికాదని,తక్షణమే లీకేజీలు సరిచేసి మిగిలిన కనెక్షన్లు పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆళ్లపల్లిలో జైల్ బరో నిరసన

**-4 లేబర్ కోడుల రద్దు చేయాలని డిమాండ్**



**ఆళ్లపల్లి ఆగస్టు 10 (తెలంగాణ పత్రిక)**
కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో ఆళ్లపల్లి మండల కేంద్రంలో జైల్ భరో కార్యక్రమం జరిగింది. 2025 నవంబర్ 21న కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను అమలు చేసిందని. దీనివల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని.పని గంటలు 8 నుండి 12కు పెరుగుతాయని జీతాలు పెరగవని నాయకులు ఆరోపించారు ఐకెపి వివో అంగన్వాడి ఆశా మిడ్ డే మీల్స్ కార్మికులకు గౌరవ వేతనం 18500 నుండి 26000 వరకు పెంచాలని డిమాండ్ చేశారు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో మార్పులు కొత్త విద్యా విధానం విద్యుత్ సవరణ బిల్లు ప్రజలపై భారం వేస్తున్నాయని విమర్శించారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈ నిరసనలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేసు ఎల్లయ్య,కొమరం హనుమంతరావు,దొడ్డి ,సుగుణ, బోజమ్మ, సుభద్ర, జయశ్రీ, శిరీష, పార్వతి, కోటమ్మ తదితరుల పాల్గొన్నారు.




# కాళేశ్వరం మోటార్లు తక్షణమే ఆన్ చేయాలి







**-రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా నీటి పంపింగ్ చేపట్టాలి**
**-తన్నీరు హరీశ్ రావు మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే**

**నంగునూరు, ఆగస్టు 10(తెలంగాణ పత్రిక):**
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న రిజర్వాయర్లను తక్షణమే నీటితో నింపి రైతులకు సాగునీరు అందించాలని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన మంత్రికి లేఖ రాశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతంగా వెంటనే కాళేశ్వరం మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత వానాకాలం పంట సీజన్‌లో ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, మరోవైపు ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు. పంటల సాగుకు అవసరమైన సాగునీటి కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

**నాలుగు లక్షల ఎకరాలకు ప్రయోజనం**

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నపూర్ణ (అంతగిరి), రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, నృసింహ(బస్వాపూర్) రిజర్వాయర్లను నీటితో నింపాలని హరీశ్ రావు కోరారు. మిడ్‌మానేరు నుంచి మోటార్లను ఆన్ చేసి నీటిని పంపింగ్ చేయడం ద్వారా ఆయా రిజర్వాయర్లతో పాటు వాటి పరిధిలోని చెరువులు, చెక్ డ్యామ్ లను నింపాలని కోరారు. దీని ద్వారా నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా గోదావరిలో వరద నీటి లభ్యత ఏర్పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అందుబాటులోకి వచ్చే ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టి రైతుల సాగు అవసరాలకు వినియోగించాలని సూచించారు. ఆలస్యం చేస్తే పంటల సాగుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**మిడ్ మానేరు నుంచి నీటి పంపింగ్ చేపట్టాలి**

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 27 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 22 టీఎంసీల నీటి లభ్యత ఉందని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మిడ్ మానేరు నుంచి మోటార్లను వెంటనే ఆన్ చేసి నీటిని పంపింగ్ చేయాలని కోరారు. దీంతో అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, నృసింహ(బస్వాపూర్) రిజర్వాయర్లను నింపడంతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న కాలువలు, చెరువులు, చెక్ డ్యామ్‌లకు నీటిని అందించి రైతుల సాగు అవసరాలను తీర్చాలని సూచించారు.

**ఎల్ఎండీకి కూడా నీటిని తరలించాలి**

లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ) పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 6.9 టీఎంసీల నీటి లభ్యత ఉందని హరీశ్ రావు తెలిపారు. మిడ్ మానేరు నుంచి ఎల్ఎండీకి నీటిని తరలించి, ఎస్ఆర్ఎస్పీ స్టేజ్--2 పరిధిలో అవసరమైన ఆయకట్టుకు సాగునీరు అందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు.

**గత యాసంగిలో 4 లక్షల ఎకరాలకు సాగునీరు**

గత యాసంగి సీజన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టులోని పై రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో సుమారు 4 లక్షల ఎకరాల్లో పంట సాగు జరిగిన విషయాన్ని హరీశ్ రావు గుర్తు చేశారు. అదే తరహాలో ప్రస్తుత వానాకాలం పంటతో పాటు రానున్న యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా ముందస్తు ప్రణాళికతో రిజర్వాయర్లను నింపాలని కోరారు. రిజర్వాయర్లను నింపడంతో పాటు వాటికి అనుసంధానంగా నిర్మించిన కాలువలు, చెరువులు, చెక్ డ్యామ్‌లను కూడా నీటితో నింపి రైతుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించాలని పేర్కొన్నారు.'’రైతు ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోవాలి. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కాళేశ్వరం మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ ప్రారంభించాలి. తద్వారా రైతులకు సాగునీరు అందించి వారి ఆందోళనను తొలగించాలి” అని హరీశ్ రావు తన లేఖ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

# హక్కుల సాధన కోసం హమాలీల జైల్ భరో బైక్ ర్యాలీ

**-నిరసన కార్యక్రమానికి నంగునూరు నుంచి సిద్ధిపేటకు భారీగా తరలిన కార్మికులు**

**నంగునూరు, ఆగస్టు 10(తెలంగాణ పత్రిక):**
కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే డిమాండ్‌తో సీఐటీయూ నంగునూరు హమాలి యూనియన్ ఆధ్వర్యంలో హమాలి కార్మికులు కదం తొక్కారు. సీఐటీయూ చేపట్టిన ‘జైలు భరో’ కార్యక్రమంలో భాగంగా నంగునూరు మండల కేంద్రం నుంచి సిద్దిపేటలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి జైల్ భరో బైక్ ర్యాలీ నిర్వహించి సిద్ధిపేటకు బయలు దేరారు. ఈ సందర్భంగా హమాలి కార్మికులు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా తరలి వెళ్లారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని వారు నినాదాలు చేశారు. రోజువారీ కష్టంతో కుటుంబాలను పోషించుకుంటున్న హమాలీలకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

**హమాలీల సమస్యలను పరిష్కరించాలి**



ఈ సందర్భంగా హమాలి యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. మార్కెట్లు, గోదాములు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు తదితర ప్రాంతాల్లో కష్టపడి పనిచేస్తున్న హమాలి కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. శారీరక శ్రమతో జీవనం సాగిస్తున్న హమాలీలకు మెరుగైన సంక్షేమం, పని భద్రత, తగిన పారితోషికం, సామాజిక భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్మికుల సమస్యలు కేవలం వ్యక్తిగత సమస్యలు కాదని, వారి కుటుంబాల జీవనోపాధితో ముడిపడి ఉన్న అంశాలని నాయకులు పేర్కొన్నారు. హమాలీల శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం లభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ఐక్యతతో పోరాటం**

సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో హమాలి కార్మికులు ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా తమ ఐక్యతను చాటుకున్నారు. నంగునూరు నుంచి సిద్దిపేటకు బైక్‌లపై ర్యాలీగా బయలుదేరిన కార్మికులు అక్కడ నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. కార్మికుల హక్కుల కోసం నిర్వహించే ఉద్యమాల్లో హమాలి కార్మికులు ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. తమ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ జైల్ భరో బైక్ ర్యాలీలో హమాలి యూనియన్ అధ్యక్షుడు అనరాజు ఎల్లయ్య, దేవులపల్లి బాలరాజు, అనరాజు తిరుపతి, దేవులపల్లి రాంబాబు, దేవులపల్లి యాదగిరి, దేవులపల్లి దేవేందర్, దేవులపల్లి కనకరాజు, గొడుగు హనుమంతు, గాడిచర్ల సంపత్ తదితర హమాలి కార్మికులు పాల్గొన్నారు.

# బోనాల జాతర పండుగకు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కు ఆహ్వానం

**జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) ఆగష్టు 10**
జగిత్యాల పట్టణ మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ నివాసంలో తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్,కళాకారుల బృందం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న బోనాల జాతర పండుగ కార్యక్రమానికి ఆమెను ఆహ్వానించారు.కార్యక్రమానికి సంబంధించిన వివరాలను కళాకారుల బృంద సభ్యులు వివరించి, పండుగకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.బోనాల పండుగను సంప్రదా



యబద్ధంగా, ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, యూట్యూబర్లు, స్థానిక ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

# ప్రతి ఇంటిపై తిరంగా.. ప్రతి గుండెలో దేశభక్తి!

-నంగునూరులో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం
-జాతీయ ఐక్యత, దేశభక్తి భావనను బలోపేతం చేయడమే లక్ష్యం

నంగునూరు, ఆగస్టు 10(తెలంగాణ పత్రిక):



దేశభక్తి భావనను ప్రతి కుటుంబంలో పెంపొందించడంతో పాటు జాతీయ ఐక్యతను చాటే ఉద్దేశంతో నంగునూరు గ్రామంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా నంగునూరు గ్రామంలో బీజేపీ నేతలు తమఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు చౌడుచర్ల వెంకట్రామిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు వల్లపురెడ్డి రజనీకర్ రెడ్డి, కిసాన్ మోర్చా సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి, గంధం పరమేశ్వర రెడ్డి, యాదగిరి, గోటూరి కిషన్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. భారత జాతీయ పతాకం దేశ గౌరవానికి, ఐక్యతకు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్నారు. త్రివర్ణ పతాకం రెపరెపలాడుతున్న ప్రతి సందర్భంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులు, అమర వీరులు, సైనికుల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు.

**దేశం ముందు మనమంతా భారతీయులమే**

'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం కేవలం ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవే యడంతో ముగిసేది కాదని చెప్పారు. దేశభక్తి భావనను ప్రతి కుటుంబానికి చేరువ చేయడం, జాతీయ సమైక్యతను బలోపేతం చేయడం, యువతలో దేశం పట్ల బాధ్యతను పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా 'ముందుగా మనమంతా భారతీయులం' అనే భావన ప్రతి ఒక్కరిలో బలపడాలని ఆకాంక్షించారు. జాతీయ పతాకం ముందు ప్రతి పౌరుడు సమానమేనని, దేశ ప్రయోజనాల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**యువతకు దేశభక్తి స్ఫూర్తి అవసరం**

దేశంలో రాజ్యాంగం అందించిన స్వేచ్ఛను గౌరవిస్తూ ప్రతి పౌరుడు తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలు, యువతకు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, రాజ్యాంగ విలువలు, జాతీయ గౌరవం గురించి తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, పెద్దలపై ఉందన్నారు. "తిరంగా మన గర్వం.. భారతదేశం మన గౌరవం.. దేశభక్తి మన బాధ్యత" అంటూ జాతీయ పతాకం పట్ల గౌరవం చాటారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడిగా భూక్యా మంగీలాల్ నాయక్

కొత్తగూడెం, ఆగస్టు 10: (తెలంగాణ పత్రిక)



నంగారా భేరి లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా భూక్యా మంగీలాల్ నాయక్ నియమితులయ్యారు. సోమవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన నియామకాన్ని ప్రకటించారు. ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ రాంబాల్ నాయక్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ బాణోత్ భూక్యా మంగీలాల్ నాయక్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా మంగీలాల్ నాయక్ మాట్లాడుతూ లంబాడీ, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు గిరిజన చట్టాల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు కొనసాగిస్తానన్నారు. లంబాడీలను రాజకీయంగా చైతన్యవంతులను చేసి హక్కుల సాధన దిశగా ముందుకు నడిపిస్తానని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ రాంబాల్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ బాణోత్‌లకు మంగీలాల్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సర్పంచ్ వీరన్న నాయక్, కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూక్యా జనార్దన్ నాయక్, మాజీ సర్పంచులు కున్‌సోతు రాంచందర్ నాయక్, బానోత్ గోవిందు, న్యాయవాది ధరావత్ రాధాకృష్ణ, మలోత్ రాజా, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు మోహన్ నాయక్, మంగళ సేవాలాల్, జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు రాందాస్ నాయక్, బానోత్ నరేష్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగా 2.25 లక్షల మందికి చేయూత

-అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
-టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి

నంగునూరు, ఆగస్టు 10(తెలంగాణ పత్రిక):



సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేతి వృత్తిపై ఆధారపడిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే పెన్షన్లు భరోసాగా నిలుస్తాయని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. సోమవారం నంగునూరులో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**కొత్తగా 2.25 లక్షల మందికి పెన్షన్లు**

రాష్ట్రంలో పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు కొత్తగా చేయూత అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఇందులో భాగంగా సుమారు 2.25 లక్షల మంది కొత్త లబ్ధిదారులకు పెన్షన్ ప్రయోజనం కల్పించనున్నట్లు తెలిపారు. దీంతో ఎన్నో కుటుంబాలకు నెలనెలా ఆర్థిక సహాయం అందుతుందని పేర్కొన్నారు.

**అసహాయులకు అండగా చేయూత**

వృద్ధాప్యంలో ఆదాయ వనరులు తగ్గిపోయిన వారికి, భర్తను కోల్పోయిన మహిళలకు, దివ్యాంగులకు, చేనేత, కల్లు గీత కార్మికులు తదితర వర్గాలకు పెన్షన్ పథకం సామాజిక భద్రత కల్పిస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆసరా పెన్షన్ ను పేదలు గౌరవంగా జీవించేందుకు ఉద్దేశించిన సామాజిక భద్రతా పథకంగా అమలు చేస్తోందని తెలిపారు. "పెన్షన్ కేవలం ఆర్థిక సహాయం కాదు.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అసహాయ వర్గాలకు ప్రభుత్వం అందించే భరోసా" అని ఏఎంసీ చైర్మన్ పేర్కొన్నారు.

**అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం**

గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు పెన్షన్ ఎంతో కీలకమని చెప్పారు. నెలనెలా అందే ఆర్థిక సహాయంతో మందులు, నిత్యావసరాలు, కుటుంబ అవసరాలను తీర్చుకోవడానికి కొంత వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.

**దళారులను ఆశ్రయించ వద్దు**

అర్హత ఉన్నప్పటికీ ఇప్పటి వరకు పెన్షన్ అందని వారు, కొత్తగా అర్హత కల్గిన వారు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. దళారులను ఆశ్రయించవద్దని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అర్హులైన వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అచ్చిన సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేర్యాల బాలయ్య, ఆవుల నాగరాజు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం

-జెండా చౌరస్తాలో జాతీయ జెండా ఆవిష్కరణ..
-భారత్ మాతాకీ జై' నినాదాలతో మార్మోగిన పట్టణం

పెద్దపల్లి ప్రతినిధి ఆగస్టు 10 ( తెలంగాణ పత్రిక )



భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ అధికారి మేకల విజయ్ కుమార్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేతబూని 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలు చేయడంతో పెద్దపల్లి పట్టణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ.. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేసేలా ప్రజలను ప్రోత్సహించడమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.దేశభక్తి, జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా జాతీయ జెండాపై గౌరవం, దేశ భక్తి భావనను ప్రతి కుటుంబంలో పెంపొందించాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శివగంగ సతీష్, తిరంగా యాత్ర కో-కన్వీనర్ కావేటి రాజగోపాల్, బెజ్జంకి దిలీప్, గుర్ర సతీష్, మహంత కృష్ణ, బొడ్డుపల్లి కుమార్, అఖిల్, మధుకర్, హరీష్, పోగుల రాజు, మంతెన కృష్ణ, మ హేష్, శ్రావణ్, రమేష్, శివసాయి, సురేష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా పుంజాల శివశంకర్ జయంతి



ముధోల్: 10ఆగస్టు(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రంలోని బట్టి గల్లి లో దివంగత, కేంద్రమంత్రి పుంజాల శివశంకర్ 97 వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల సాధికారత కోసం పుంజాల శివ శివశంకర్ చేసిన సేవలు చిరస్మరణీ యమని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ప్రతి ఒక్కరు ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో మాజీ వీడీసీ అధ్యక్షులు గుంజల నారాయణ, తోట్ల శంకర్ ఆయిటీ గంగాధర్, పోశెట్టి,మాజీ ఉపసర్పంచులు గడ్డం సుభాష్, దశరథ్,వల్లోల్ల నాగేష్, మున్నూరు కాపు పట్టణ అధ్యక్షులు లవన్, ప్రధాన కార్యదర్శి గోసుల రాజు, ఉపాధ్యక్షుడు సంగొల్ల ప్రకాష్, సంగొల్ల శ్యామ్, గంగాసింగ్, గంగాధర్, నవీన్, శైలు, పోశెట్టి, రాజన్నతో పాటు పలువురు బీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముధోల్: 10ఆగస్టు(తెలంగాణ పత్రిక)

మండలంలోని బ్రహ్మన్ గావ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏ ఈ శ్రీకాంత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివే యడం జరుగుతుందన్నారు. బ్రహ్మన్ గావ్ సబ్ స్టేషన్ లో గల గ్రామాల్లో 33/11 కేవీ లో ఇంటర్ లింకింగ్ పనులను చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ప్రధాని మోడీ పిలుపుతో ఇంటిపై త్రివర్ణ పతాకం ఆవిష్కరణ



నంగునూరు, ఆగస్టు 10(తెలంగాణ పత్రిక):

భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశభక్తిని చాటుతూ సోమవారం సిద్దిపేట జిల్లా భారతీయ జనత పార్టీ జిల్లా కార్యదర్శి వాసరి యాదమల్లు తన నివాసంపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామంలోని తన ఇంటిపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశభక్తిని చాటారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా వాసరి యాదమల్లు తన ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భారతీయుడిలో దేశభక్తి భావనను మరింతగా పెంపొందించడంతో పాటు జాతీయ పతాకానికి గౌరవం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుని దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడేలా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా దేశభక్తి, జాతీయ ఐక్యతను ప్రతిబింబించేలా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## సర్పంచ్ మల్లేశం కుటుంబాన్ని పరామర్శించిన పద్మా దేవేందర్ రెడ్డి

పాపన్నపేట, ఆగస్టు 10:(తెలంగాణ పత్రిక)



పాపన్నపేట మండలం నార్సింగి గ్రామ సర్పంచ్ ధారబోయిన మల్లేశం తల్లి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా మల్లేశంతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతురాలి మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వీరి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరామిరెడ్డి,కొడపాక సర్పంచ్ వంకెల కాశీనాథ్ రావు ,మాజీ సర్పంచ్ లు శ్రీనాథ్ రావు, బ్రిం. మల్లేశం,నాయకులు సోములు, దుర్గయ్య, అనిల్ రెడ్డి, బాబా గౌడ్,అంతోని, శ్రీనివాస్ గౌడ్,మేడిశెట్టి రాము,దండం సామెల్, మల్లేశం చంద్రన్న తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి కమిటీ సమావేశం



ముధోల్: 10ఆగస్టు(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి కమిటీ సమావేశాన్ని మండల అధ్యక్షులు సాపేవార్ కిష్టయ్య ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సమావేశానికి డీసీసీ సెక్రటరీ ఇంచార్జ్ ఉమామహేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సాపేవార్ కిష్టయ్య కాంగ్రెస్ పార్టీని గ్రామ గ్రామాల్లో విస్తరించి అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే కార్యకర్తలను కమిటీ లుగా ఎన్నుకోనున్నారని పేర్కొన్నారు. పార్టీలో కష్టపడ్డ వారికి పదవులుదక్కుతాయన్నారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మండల స్థాయి కమిటీలే పునాదులని పేర్కొన్నారు. త్వరలో మండల కమిటీల పదవులను వెల్లడించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముధోల్ మాజీ ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ ఇంచార్జ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సమావేశం



ముధోల్: 10ఆగస్టు(తెలంగాణ పత్రిక)

కాంగ్రెస్ పార్టీ గ్రామ గ్రామాల్లో మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఇంచార్జ్ ఉమామహేశ్వర్ కార్యకర్తలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కమిటీ స్థాయి సమావేశంలో రాబోయే పార్టీ ప్రణాళికలు, ముఖ్యంశాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో అష్ట సర్పంచ్ రావుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పతంగి కిషన్, ప్రేమ్ నాథ్ రెడ్డి, అజీజ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ నజీమ్ హైమద్,ఆయాజ్, జమిల్,రాజు,గోవింద్, పోతారెడ్డి తోపాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలు రాజకీయంగా సామాజికంగా ఎదిగిన రోజే నిజమైన న్యాయం జరుగుతుంది

-బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు

నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (తెలంగాణ పత్రిక)



నిర్మల్ సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ కొట్టే శేఖర్ ని మరియు ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందినటువంటి డాక్టర్ కత్రోజి అశోక్ చారిని ఘనంగా సన్మానించిన నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం నిర్మల్: బీసీలు రాజకీయంగా సామాజికంగా ఎదిగిన రోజే వారికి నిజమైన న్యాయం జరిగినట్లు అని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు అన్నారు సోమవారం నిర్మల్ పట్టణంలోని బీసీ సంఘ భవనంలో ఇటీవల నిర్మల్ గండి రామన్న దత్త సాయి ఆలయ కమిటీ చైర్మన్గా నూతనంగా నియామకమైన కొట్టే శేఖర్ ని మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల గౌరవ డాక్టరేట్ స్వీకరించిన నిర్మల్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీ డాక్టర్. కత్రోజు అశోక్ చారిని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా విద్యా పరంగా ఉద్యోగ పరంగా ముందుకు వచ్చిన రోజు వారికి నిజమైన న్యాయం జరిగినట్లు అవుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ చందుల ఉషన్న జిల్లా కో- కన్వీనర్లు సిరికొండ రమేష్ జింక లక్ష్మీనారాయణ పండరినాథ్ కార్యనిర్వాహక అధ్యక్షులు మరికంటి జీవన్ అసోసియేట్ అధ్యక్షులు కొత్తపల్లి గంగాధర్ అధ్యక్షులు ఎంబడి.చంద్రశేఖర్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో కదం తొక్కిన కార్మికులు

-జైల్ భరో కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ రాస్తారోకో

-కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

-కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాల్సి

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10, తెలంగాణ పత్రిక



కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీలు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కార్మిక చట్టాలు, హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని కాలేజీ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికుల హక్కులను కాపాడాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి మోసం రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక వర్గం ఎన్నో సంవత్సరాల పాటు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరిస్తోందని ఆయన మండిపడ్డారు. కొత్త కార్మిక చట్టాల పేరుతో కార్మికులను యాజమాన్యాలకు మరింత అనుకూలంగా ఉండే పరిస్థితుల్లోకి నెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దేశ నిర్మాణంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, వారి శ్రమతోనే పారిశ్రామిక, వ్యవసాయ, నిర్మాణ రంగాలు ముందుకు సాగుతున్నాయని మోసం రమేష్ అన్నారు. అలాంటి కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా రైతుల సమస్యలను కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. రైతులు పండించిన పంటలకు తగిన మద్దతు ధర కల్పించకుండా రైతులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని మోసం రమేష్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు నిరంతర ఉపాధి, కనీస వేతనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా కార్మిక, రైతు, వ్యవసాయ కూలీలు, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని, లేకపోతే కార్మిక వర్గ ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు తమ చట్టాలు, హక్కులను పరిరక్షించుకోవడానికి ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్, జిల్లా నాయకులు అన్నల్దాస్ గణేష్, సూరం పద్మ, ఎలిగేటి రాజశేఖర్, గీస బిక్షపతి, దాసరి రూప, ఆడెపు రజిత, బూర శ్రీనివాస్, మల్యాల నరసయ్య, శ్రీరామ్ సదానందం, సిరిమల్ల సత్యం, గోవిందు లక్ష్మణ్, కోల శ్రీనివాస్, బేజుగం సురేష్, స్వర్గం శేఖర్, సావణపల్లి రాములు, గిరిబాబు, మల్లయ్య, ప్రభాకర్, నరేందర్, రాజెల్లయ్య, శ్రీధర్, కమలాకర్, రమేష్, శంకర్, బాలయ్య, లచ్చయ్య, సురేష్, రవీందర్, శ్రీనివాస్, పోచమల్లు తదితర వివిధ రంగాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

-జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10, తెలంగాణ పత్రిక



వ్యాపారులను బెదిరించి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను వేములవాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రూ.50 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.అరెస్టయిన నిందితులను కొనరావుపేట మండలం ఏగలాస్పూర్ గ్రామానికి చెందిన దండు వినోద్ (33), ప్రస్తుతం వేములవాడలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న వ్యక్తిగా, వేములవాడ నాంపల్లికి చెందిన పెద్దిగారి అమరగొండ అజయ్ (27)గా పోలీసులు గుర్తించారు. ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. నిందితులిద్దరూ కలిసి వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని వారిని బెదిరించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని పథకం రూపొందించారు. ఇందులో భాగంగా వేములవాడ పట్టణ పరిధిలోని అగ్రహారం గ్రామ శివారులో స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్న నీలం గురవయ్యను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు.ఈ నెల 9న దండు వినోద్ తన మొబైల్ ఫోన్ నుంచి గురవయ్యకు ఫోన్ చేసి, క్రషర్‌కు సంబంధించిన లైసెన్స్, భూమికి సంబంధించిన విషయాలపై అసత్య ప్రచారం చేస్తామని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం గురవయ్య అగ్రహారం ప్రాంతానికి రాగా, నిందితులిద్దరూ అతడిని అగ్రహారం గుట్టల వద్దకు తీసుకెళ్లి.. క్రషర్, వ్యాపారానికి సంబంధించి ఎలాంటి అసత్య ప్రచారం చేయకుండా ఉండాలంటే రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. డబ్బులు ఇవ్వకపోతే వ్యాపారాన్ని దెబ్బతీస్తామని బెదిరించినట్లు తెలిపారు.నిందితుల బెదిరింపులతో భయపడిన గురవయ్య ఏటీఎంకు వెళ్లి రూ.50 వేల నగదు తీసుకువచ్చి వేములవాడలోని అగ్రహారం టీ పాయింట్ వద్ద నిందితులకు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఇదే తరహాలో వేములవాడకు చెందిన రైస్ మిల్లర్ బండ మల్లేశంను కూడా నిందితులు బెదిరించి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. బాధితుల ఫిర్యాదుల మేరకు వేములవాడ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు కొనసాగించిన పోలీసులు నిందితులను ఆదివారం రాత్రి సాయినగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.50 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు.

**ప్రజలు భయపడవద్దు: ఎస్పీ**

ఎవరైనా వ్యక్తులు బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, ప్రజలు ఎలాంటి బెదిరింపులు, ఒత్తిళ్లకు లొంగకుండా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు. బెదిరింపులకు పాల్పడటం, అసత్య ప్రచారాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, అక్రమంగా డబ్బులు వసూలు చేయడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# నర్మాల ఎగువ మానేరు నుండి చెరువుల లోకి నీటిని విడుదల చేయాలి



గంభీరావుపేట తెలంగాణ పత్రిక డిసెంబర్ 10

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నర్మాల అప్పర్ ఎగువ మానేరు ప్రాజెక్టును బిజెపి మండల అధ్యక్షులు కోడె రమేష్ సందర్శించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు కోడె రమేశ్ మాట్లాడుతూ సిరిసిల్ల ఎమ్మెల్యే మాజీ మంత్రి కేటి రామారావు ఐదు కోట్ల రూపాయలతో ఎగువ మానేరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చి పర్యాటక కేంద్రంగా చేస్తానని గొప్పగా హామీలు ఇచ్చిన కేటీఆర్ నేటి వరకు మాటలు కోటలు దాటుతాయి తప్ప చేతలు గడప దాటవు అన్నట్టుగా ఉన్నదని ఎద్దేవ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ లను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసిందనీ ప్రస్తుతం ఎగువ మానేరు పరిసర ప్రాంతాల్లో రైతులు, ప్రజలు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడకుండా ఉండడానికి ప్రభుత్వం సంబంధిత



అధికారులు తక్షణమే స్పందించి ఎగువ మానేరు ఎడమ, కుడి కాలువల నుండి నీటిని విడుదల చేసి చెరువులను నింపే విధంగా చర్యలు చేపట్టాలని నీటిని విడుదల చెయ్యని యెడల భారతీయ జనతా పార్టీ మండల శాఖ పక్షాన ఆందోళన చేస్తామని ప్రజల అవసరాలకు వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ నాయకులు స్వామి నాగరాజు బండ దేవయ్య శ్రీనివాస్ చారి రవీందర్ నాయక్ దేవా గౌడ్ శ్రీనివాస్ గౌడ్ దేవేందర్ యాదవ్ ఎల్లం నవీన్ నాయకులు పాల్గొన్నారు.

# వరుణ యాగంతో రేవంత్ ఉత్తమ్ లకు జ్ఞానోదయం కావాలి

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) ఆగష్టు 10

జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి,పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి,జిల్లా పరిషత్ మాజీ ఛైర్పర్సన్ దావ వసంత సురేష్,బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఉత్పన్నం అయ్యే పరిణామాల్ని అధిగమించేందుకు గత ఆరు మాసాలుగా హెచ్చరించిన పట్టించుకోకుండా ఇప్పుడు వరుణ యాగం చేస్తుండడం విస్మయం కలుగుతుంది. పోతిరెడ్డి పాడు నుండి 50000 క్యూసెక్కుల నీటిని తీసుకెళ్తున్నారు.నిత్యం లక్ష క్యూసెక్కుల నీరు వస్తుంది. అన్నారం సుందిల్ల వినియోగించుకోవాలనే ఆలోచన చేయడం లేదు.రేవంత్ ముప్పయి మాసాలు నిద్ర పోయారు.మహారాష్ట్రతో చర్చలు చేయాలని ఉంటే ఇప్పటి వరకు ఏం చేశారు. కన్నెపల్లి నుండి కాపర్ డాం నిర్మించి నీటిని ఎత్తిపోస్తే రివర్స్ పంపింగ్ శ్రీరామ్ సాగర్ వరకు వెళ్తాయి.ప్రభుత్వం చేయాల్సిన పనిచేయకుండా వరుణ యాగం చేస్తే ఎలా..? ఇప్పటికే దేవుడు కరుణించి వర్షాలు కురిశాయి. గతంలో ఆమోదం పొందిన ప్రాజెక్ట్ లను పునః పరిశీలించే అవకాశం లేదు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ సిడబ్ల్యూసి ఆమోదం పొందింది. కేసీఆర్ దూరదృష్టితో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి తెలంగాణ రాష్ట్రానికి భవిష్యత్ చూపెట్టారు అని



అన్నారు. ఆమోదం పొందిన ప్రాజెక్ట్ లకు చంద్ర బాబు నాయుడు గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ వద్ద అభ్యంతరం తెలుపడం ఏమిటి..? ఉద్యమ నాయకుడిగా, ప్రాజెక్ట్ ల పరిరక్షణ కోసం హరీష్ రావు చంద్రబాబు,రేవంత్ రెడ్డి కుట్రలు వెలుగులోకి తీసుకువచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో అన్ని అంతర్గత ప్రాజెక్టులకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, జాతీయ బ్యాంక్ లు కూడా రుణాలు మంజూరు చేసింది.ఇవాళ మళ్ళీ తెలంగాణ హక్కులను కాజేసే కుట్రలు కొనసాగుతున్నాయి.చంద్ర బాబు డైరెక్షన్ కు అనుగుణంగా ఓటు కు నోటు అమలు చేసింది రేవంత్ రెడ్డి..? గురు శిష్యులు మళ్ళీ అవే కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారు.ఫసల్ బీమా యోజనలో రైతులు 25 శాతం,కేంద్రం రాష్ట్రం మిగిలిన మొత్తం చెల్లిస్తుంది. దానిని అమలు చేసేందుకు చొరవ చూపడం లేదు.దేశంలో ఎక్కడ లేనివిధంగా కేసీఆర్ రైతు బంధు ప్రవేశపెట్టి రైతు కుటుంబాలను ఆదుకున్నారు. వరుణ యాగంతో రేవంత్ రెడ్డికి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కి జ్ఞానోదయం కావాలని అన్నారు.యాగాలు మంచివే వాటితో ఫలితాలు ఉంటాయి,కానీ మానవ ప్రయత్నం చేయకుండా,యాగాలు చేస్తే ఎలా...? అని ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి,ఉత్తమ్ కుమార్ చేతులు ఎత్తేశారు,ఇక ప్రభుత్వ పాలన దేవుడే చూసుకోవాలన్నారు. మోడీ కి రేవంత్ రెడ్డికి ఉన్న సాన్నిహిత్యం తో అనుమతులు ఇప్పిస్తే సంతోషం.ప్రాజెక్ట్ ల నిర్మాణం లో జాప్యం చేస్తే ప్రజలు క్షమించారు అని జీవన్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆయిల్నేని వెంకటేశ్వర రావు,కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మైసూర్ లోని జెఎస్ఎస్ కళాశాల సందర్శన

-ప్రిన్సిపల్ ను సన్మానించిన ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి వార్డు సభ్యులు

గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగష్టు 10

అంగవైకల్యం అడ్డు కాదని... ఉన్నత విద్యా ను అభ్యసిస్తున్న మైసూర్ లోని మహా విద్యపీత జిఎస్ఎస్ (డిఫరెంట్లీ అబ్లీడ్) పాలిటెక్నిక్ కళాశాలను గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి వార్డు సభ్యులు రెడ్డిమల్ల రాజనర్సు చిలక ప్రశాంత్ లు సందర్శించి ప్రిన్సిపాల్ ను శాలువాతో సత్కరించి విద్యార్థినీ విద్యార్థులతో సరదాగా గడిపారు ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల లోని దాదాపు 14 విద్యార్థినీ విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు... మూగ, చెవిటి, వివిధ అంగవైకల్యం కల విద్యార్థులు వారి




యొక్క పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తూ.. ఉత్సాహంగా వారి యొక్క భాషలో మాట్లాడడం చాలా ఉన్నదని సమాజంలో అంగవైకల్యం అడ్డే కాదనీ అని కళ్లకు కట్టినట్టుగా కనిపించింది... వారు చక్కగా సైగల ద్వారా మాట్లాడుకోవడం చాలా ఆనందం వ్యక్తం చేస్తు వీరు ప్రభుత్వ ఉద్యోగాలు పొంది మంచి ఉన్నత స్థానంలో ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఎం శివ కుమారస్వామి,ఉప సర్పంచ్ లక్కిరెడ్డి



కమలాకర్ రెడ్డి వార్డు సభ్యులు రెడ్డి మల్ల రాజనర్సు, సుంకరి ప్రశాంత్, కళాశాల యజమాన్యం తదితరులు ఉన్నారు

# కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు

-రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
-కాంగ్రెస్ అంటే రైతులురైతులు అంటే కాంగ్రెస్
-ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్గారు

కామారెడ్డి ,ఆగస్టు 10, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని, కొంత ఆలస్యం కావచ్చేమో కానీ ఎవరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. కామారెడ్డి పట్టణంలోని గోపాల స్వామి ఆలయం సమీపంలోని సొసైటీ కార్యాలయంలో కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన గూడెం శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కామారెడ్డిలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్ల అభినందన సభ, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గారు నూతన చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డితో పాటు డైరెక్టర్లను అభినందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ,

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసిన కార్యకర్తలను కాంగ్రెస్ ఎప్పటికీ విస్మరించదు" అని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు చేసిన కృషి ఎంతో గొప్పదని, కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక అని ఆయన అన్నారు. కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన ప్రతి ఒక్కరినీ గుర్తించి తగిన గౌరవం కల్పించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని తెలిపారు.

**రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా



ఉంటుందని షబ్బీర్ అలీ అన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.కాంగ్రెస్ అంటేనే రైతులు.. రైతులు అంటేనే కాంగ్రెస్ అని ఆయన పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేకమైన చరిత్ర ఉందని, రైతుల కష్టాలు తెలిసిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రైతులకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలిచి, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు రైతులకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. రైతులు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని అన్నారు.

**సహకార సంఘాలు రైతులకు మరింత చేరువ కావాలి**

PACS నూతన చైర్మన్, డైరెక్టర్లు రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని షబ్బీర్ అలీ సూచించారు. సహకార సంఘాలు కేవలం రాజకీయ పదవులు కాకుండా రైతుల సంక్షేమానికి పనిచేసే వేదికలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. రైతులకు అవసరమైన సహకారం అందిస్తూ, వ్యవసాయ రంగ అభివృద్ధిలో రాజులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. కామారెడ్డి సొసైటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గూడెం శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీగారు, రైతుల నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేయాలని ఆకాంక్షించారు. డైరెక్టర్లంతా సమన్వయంతో పనిచేసి సొసైటీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షులు కైలా శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పిసిసి జనరల్ సెక్రటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి , కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఉమా శ్రీనివాస్,పట్టణ అధ్యక్షులు ఐరేని సందీప్, పండ్లరాజు, గు డుగుల శ్రీనివాస్, అజ్మత్ , భరత్,ఎడ్ల రాజిరెడ్డి, రాజా గౌడ్, నవసిలాల్, రమేష్ గౌడ్, అంకం కృష్ణారావు, ఆశ బోయిన శ్రీనివాస్ , గోనె శ్రీనివాస్, భూమని బాలరాజ్, రెడ్డి నాయక్, ఇంద్రసేనారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి, మాజీ ఎంపీపీ నర్సింగరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు నాయకులు, ముఖ్య కార్యకర్తలు, PACS నూతన చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, నూతన డైరెక్టర్లు, సహకార సంఘం ప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వతంత్ర సమరయోధుల స్మరణ కోసమే హర్ ఘర్ తిరంగా

-ప్రతి ఇంటి పై జాతీయ జండా ఎగరవేయాలి
-కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



కామారెడ్డి ,ఆగస్టు 10, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

నరేంద్ర మోదీ పిలుపు మేరకు కామారెడ్డి లోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంపై సోమవారం జాతీయ జండా ఎగురవేసిన కామారెడ్డి శాసన సభ్యులు శ్రీ కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఈ సందర్భంగా కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య పోరాట యోధులను స్మరించుకుంటూ వారి త్యాగాలపై సాధించిన స్వాతంత్ర్యాన్ని నేటి తరం వారికి గుర్తు చేస్తూ రెపరెపలాడే జాతీయ జెండాను ప్రతి ఇంటిపై ఎగరవేయాలని ప్రధాని నరేంద్ర మోదీ గారు ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కామారెడ్డిఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జాతీయ జండా ఆవిష్కరణ చేసినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు తమ తమ ఇంటిపై జాతీయ జండా ఎగురవేసి దేశభక్తి నీ చాటుకోవాలని అన్నారు.

## కోడి పందేలు ఆడుతున్న పలువురి అరెస్ట్

-జిల్లాకు పాకిన కోడిపందాలు బెట్టింగ్



కామారెడ్డి, ఆగస్టు 10, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతి నిధి)

కోడి పందేల సంస్కృతి కామారెడ్డి జిల్లాకు పాకింది. పలువురు రూ.వేలల్లో బెట్టింగ్లు పెడుతున్నారు. సదాశివనగర్ మండలంలో కోడిపందేల స్థావరంపై పోలీసులు మెరుపు దాడులు చేసి పలువురిని అరెస్ట్ చేశారు. సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి గ్రామంలో భారీగా కోడిపందేలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతో సదాశివనగర్ పోలీసులు కామారెడ్డి సీసీఎస్ పోలీసుల సహకారంతో దాడి చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అక్కడి నుంచి 9 బైక్‌లు, 3 కార్లు, 11 సెల్‌ఫోన్లు, 65 కత్తులు రూ.45,050 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో మండలంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ కోడిపందేలు, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని, ఇకపై ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అర్హత లేకున్నా వైద్యం పేదల ప్రాణాలతో చలగాట శీ

కామారెడ్డి, ఆగస్టు 10,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

గ్రామీణ ప్రాంతాలలో అత్యవసర వైద్య చికిత్సలు అందించేది ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులే. చిన్న పాటి జ్వరం వచ్చినా, నొప్పి వచ్చినా సమయం సందర్భం లేకుండా చికిత్సలు అందించడంలో ముందుంటారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అయితే కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు వారి పరిధి దాటి చికిత్సలు చేస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటినుంచో వస్తున్నాయి. అయినా వారు పరిధి దాటి చికిత్స అందించకుండా కట్టడి చేయడంలో వైద్యశాఖ పూర్తిగా విఫలం అవుతుందనే ప్రచారం సాగుతోంది. కామారెడ్డి జిల్లాలో పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న శంకర్ దాదాల ముఠా రెచ్చిపోతోంది. వైద్య విద్య లేకుండానే కత్తులు పట్టి ఆపరేషన్లు చేస్తూ, తక్కువ ఫీజు పేరుతో పేదలను బుట్టలో వేస్తున్నారు. అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలో పలు ప్రాంతాల్లో బోర్డులు, రిజిస్ట్రేషన్ ఏమీ లేకుండా ఆర్ఎంపీ, పిఎంపి వైద్యులు ఇళ్లల్లోనే చిన్న గదులను క్లినిక్‌లుగా మార్చారు. వైద్య విద్య, డిగ్రీ లేని కొంతమంది డాక్టర్లు అవతారమెత్తి కుట్లు వేయడం, కురుపులకు ఆపరేషన్, చిన్న చిన్న శస్త్రచికిత్సలు చేస్తున్నారు. కొంతమంది ఏకంగా డెలివరీలు సైతం చేస్తున్నట్టుగా సమాచారం స్టెరిలైజేషన్ పరికరాలు లేవు. ప్రమాణాలు లేవు. అయినా నిర్భయంగా కత్తులు పట్టి కోతలు పెడుతున్నారు. ఇన్ఫెక్షన్ వచ్చినా, పరిస్థితి చేయిదాటినా బాధ్యత తీసుకునేవారు కరువవుతున్నారు.

# ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



జగిత్యాల, ఆగస్టు 10,( తెలంగాణ పత్రిక ):

జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీఆర్ నగర్ 10, 11వ వార్డుల్లోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 241, 242, 243 పరిధిలో చేపట్టిన ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జెల్ల రవీందర్, ఎన్నారై సెల్ మరియు బూత్ కోఆర్డినేటర్ షేక్ చాంద్ పాషా సోమవారం పరిశీలించారు. ఎస్ఆర్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల మ్యాపింగ్ నిర్వహిస్తూ, ఓటర్లు చిరునామా మార్పు (షిఫ్టింగ్), మరణించిన ఓటర్లు, డబుల్ ఓటర్లు తదితర వివరాలను సేకరించారు. ఇప్పటివరకు సుమారు 95 శాతం మేర ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బూత్‌ల వారీగా ఓటర్ల వివరాలను పరిశీలించి, మిగిలిన మ్యాపింగ్ ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు అనిత, వసంత, రజిత పాల్గొన్నారు.

# ప్రచార యాత్ర భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున పాదయాత్ర




మిర్యాలగూడ ప్రతినిధి//ఆగస్టు 10:(తెలంగాణ పత్రిక):-

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రచార యాత్రలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలో పెద్ద ఎత్తున పాదయాత్ర చేయడం జరిగినది. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్రంలో బిజెపి పాలన అస్తవ్యస్తంగావటంతో సిపిఐ పార్టీ ప్రజా పోరాటాల వైపు ప్రజలని మమేకం చేసింది కే పాదయాత్రలు ప్రచార జాతాలు కొనసాగిస్తున్నామని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత డీజిల్ పెట్రోల్ గ్యాస్ నిత్యవసర వస్తువులు ధరలు పెరగడం వలన అన్ని వర్గాలకు సంబంధించినటువంటి ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారు అన్నారు. ఇవ్వాల స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేయకుండా భారతదేశంలో రైతులకు ఏ విధంగా న్యాయం జరుగుతుందో బిజెపి ప్రభుత్వం చెప్పాలని సందర్భంగా వారు అన్నారు. రైతుల పండించిన పంటకు కనీసం మద్దతు ధర చట్టబద్ధత కూడా కల్పించలేకుండా పోతుందని వెంటనే చట్టబద్ధత కల్పించాలని వారన్నారు. రైతులు పొలంలో చల్లి ఎరువుల ధరలు ఒక బస్తాకు 800 రూపాయల నుండి 600 రూపాయల వరకు ధర. పెరిగిందని దానివలన రైతులు వ్యవసాయానికి దూరమయ్యే పరిస్థితి అవుపడుతుందని వారన్నారు ఒకవైపు ఈ దేశానికి రైతు వెన్నుముకని రైతు ఏడిస్తేనే రాజ్యం ఏడుస్తుందని ప్రగల్బాలు చెప్పే నాయకులు ఇవాళ రైతు పరిస్థితి ఆగమే గోచముగా ఉందని వారన్నారు ఒకవైపు 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులుగా విభజించి కార్మికుల బ్రతుకులతో చలగాటాలాడుతుందని ఈ చట్టాల వలన కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం కలిగే విధంగా ఉన్నాయి తప్ప కార్మికులకు రైతులకు ఉపయోగపడే విధంగా లేవని వారన్నారు ఈ బీజేపీ ప్రభుత్వం వచ్చిన కానుండి అన్ని వర్గాల ప్రజలు కార్మికులు, రైతులు ఆందోళన చెందుతున్నారని వారన్నారు అందుకే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుపోయి భవిష్యత్తులో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేస్తామని వారు అన్నారు ఈ పాదయాత్రలు మండల కార్యదర్శిలు అంజ నపల్లి రామలింగం జిల్లా యాదగిరి పోలేపల్లి విజయ్ కుమార్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగా నాయక్ సాలె జగన్ ప్రజానాట్యమండలి నాయకులు వెన్నెల వెంకన్న కలకొండశ్రీను వంగూర్ శీను మహిళా సమైక్య నాయకురాలు దాసర్లదుర్గమ్మ ఎర్రబోతు పద్మ ఎస్కే షమీం డి శాంతి లింగంపల్లి సైదమ్మ జమ్ముల కోటయ్య లక్ష్మయ్య ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు బస్కర్ల పరమేష్ ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా యశ్వంత్, బంటు దేవి, వరప్రసాద్, చింతమల రాములు, గువ్వ వెంకటయ్య, నగేష్, వెంకన్న, శ్యామ్, భాష, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

# చదువుకున్న బడికి తిరిగి వచ్చిజ్ఞాపకాల ఒడిలో మునిగిపోయిన షబ్బీర్ అలీ

**-తాను విద్యనభ్యసించిన పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయించా**

కామారెడ్డి ,ఆగస్టు 10, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలుర హై స్కూల్ లో తాను చదువుతున్నానని తాను చదువుకున్న బడికి ఏదో ఒకటి చేయాలని మనస్కులు ఎప్పుడు అనుకున్నారని అందులో భాగంగా కొత్త బాణం నిర్మాణానికి నిధులు మంజూరు కృషి చేశానని ప్రభుత్వ సలహాదారు శిబిరాలు అన్నారు. పాత భవనం కూల్చే ముందు క్లాస్‌రూమ్‌లో కూర్చొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న ప్రభుత్వ సలహాదారు. ఒక మనిషి జీవితంలో ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించినా తనను తీర్చిదిద్దిన పాఠశాల జ్ఞాపకాలను మాత్రం ఎప్పటికీ మరచిపోలేడు. అందుకు నిదర్శనంగా నిలిచారు కామారెడ్డి ముద్దుబిడ్డ, మాజీ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తాను విద్యనభ్యసించిన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించిన షబ్బీర్ అలీ పాత భవనాన్ని చూసి ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. చిన్ననాటి అడుగులు వేసిన ప్రాంగణం, విద్యాబుద్ధులు నేర్చుకున్న తరగతి గదులు, తనతో కలిసి చదువుకున్న స్నేహితులు... ఒక్కొక్కటి ఆయన కళ్లముందు మెదిలాయి. పాత భవనాన్ని కూల్చి ఆధునిక వసతులతో నూతన పాఠశాలగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా ఆయన పాఠశాలను సందర్శించారు. తాను చదువుకున్న తరగతి గదిలోకి వెళ్లి కొద్దిసేపు కూర్చొని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు ఆ సమయంలో ఆయన ముఖంలో కనిపించిన భావోద్వేగం అక్కడున్న పూర్వ విద్యార్థులను సైతం కదిలించింది.

**ఈ బడికి నేను ఏదో ఒకటి చేయాలి**

తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఆలోచన తనలో ఎప్పటి నుంచో ఉందని షబ్బీర్ అలీ తెలిపారు. నేను చదువుకున్న బడి ఇది. ఈ పాఠశాల నాకు కేవలం



ఒక విద్యాలయం కాదు నా జీవితానికి పునాది వేసిన ప్రదేశం. ఇక్కడి నుంచే నా ప్రయాణం ప్రారంభమైంది. అందుకే ఈ బడికి ఏదో ఒక మంచి చేయాలనే తపన ఎప్పటికీ ఉంటుంది" అని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు. 1971లో తాను విద్యనభ్యసించిన ఈ పాఠశాల విద్యార్థులను, పూర్వ విద్యార్థులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తనతో కలిసి చదువుకున్న మిత్రులను మళ్లీ అదే పాఠశాల ప్రాంగణంలో కలుసుకోవడం తనకు మరపురాని అనుభూతి అని తెలిపారు.

**రూ.5 కోట్లతో ఆధునిక పాఠశాలగా రూపాంతరం**

తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి దృష్టికి పాఠశాల అవసరాలను తీసుకెళ్లి రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారు. పాఠశాల భవన అభివృద్ధితో పాటు విద్యార్థులకు నేటి ఆధునిక విద్యా ప్రమాణాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించేందుకు ఆయన ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. అత్యాధునిక ల్యాబొరేటరీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులు, ఆధునిక విద్యా సౌకర్యాలతో పాఠశాలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన చోట తన సొంతంగా కూడా ఖర్చు చేస్తూ సహకరిస్తున్నట్లు తెలిపారు.

**పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనం**

ఈ సందర్భంగా పాఠశాలలో పూర్వ విద్యార్థులతో షబ్బీర్ అలీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తనతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులను ఆత్మీయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి అనుభవాలు, పాఠశాలలో గడిపిన రోజులు, అప్పటి ఉపాధ్యాయులు, స్నేహితులతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకున్న పాత స్నేహితుల మధ్య ఆత్మీయత, ఆనందం, జ్ఞాపకాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. తాను చదివిన పాఠశాల పాత భవనం త్వరలో కొత్త రూపు సంతరించుకోనుండటంతో ఒకవైపు ఆనందంగా ఉన్నప్పటికీ, తన బాల్య జ్ఞాపకాలకు సాక్ష్యంగా నిలిచిన పాత భవనాన్ని వీడాల్సి రావడం కొంత భావోద్వేగానికి గురిచేసిందని షబ్బీర్ అలీ తెలిపారు. "భవనం మారుతుంది... కానీ ఈ బడి నాకు ఇచ్చిన జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ మారవు" అన్న ఆయన మాటలు అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేశాయి.

**బడిని మరచిపోని బిడ్డ...**

జీవితంలో ఎంత ఎదిగినా తనను తీర్చిదిద్దిన విద్యాలయాన్ని మరచిపోకుండా, అదే పాఠశాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు తీసుకురావడమే కాకుండా ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు కృషి చేయడం పట్ల పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. తాను చదివిన బడికి తిరిగి వచ్చి... అక్కడి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్న షబ్బీర్ అలీ ప్రయత్నాలు, "చదువు ఇచ్చిన బడికి రుణం తీర్చుకోవాలనే" గొప్ప మనసుకు నిదర్శనంగా నిలుస్తున్నాయని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కైలా శ్రీనివాస్, మహమ్మద్ ఇలియాస్, పండ్ల రాజు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు

**-బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10, తెలంగాణ పత్రిక

పదేళ్ల పాలనలో సిరిసిల్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, మెడికల్, నర్సింగ్, అగ్రికల్చర్ కళాశాలలను తీసుకువచ్చిన ఘనత మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు దక్కుతుందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ అన్నారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్‌పై కొందరు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కేటీఆర్ హయాంలో సిరిసిల్లలో విద్య,




వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేశారని రవి గౌడ్ పేర్కొన్నారు. మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, అగ్రికల్చర్ కళాశాల వంటి విద్యాసంస్థలు ఏర్పాటు కావడంతో జిల్లా ప్రజలకు ఉన్నత విద్య, వైద్య రంగాల్లో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న ముఖ్యమంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైతే బీఆర్ఎస్ తరఫున ప్రజల పక్షాన నిలబడి మరిన్ని పోరాటాలు కొనసాగిస్తామని రవి గౌడ్ స్పష్టం చేశారు. కేటీఆర్ నాయకత్వంలో సిరిసిల్ల మరింత అభివృద్ధి చెందేలా బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, శ్రీనివాస్, మహేష్, జమీర్, శివ, అనుదీప్, వెంకటేష్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగని హైమస్ లైట్లు చీకటిలో పెద్దమ్మ స్టేజి

**-చెడిపోయిన హైమాస్ లైట్లు బాగు చేయాలంటూ ప్రజల ఆవేదన**

గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 10

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజి వద్ద హైమస్ లైట్ చెడిపోయి చాలా రోజులు గడుస్తున్నా వాటిని ఏర్పాటు చేయడంలో అధికారులు ప్రజా ప్రతినిధులు విఫలం అయ్యారంటూ మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రధానంగా గంభీరావుపేట నుండి సిద్దిపేట కామారెడ్డి సిరిసిల్ల కు వెళ్లే ప్రధాన రహదారికి కేంద్ర బిందువుగా పెద్దమ్మ స్టేజిని పిలుస్తారు ఇక్కడి నుండియే మూడు జిల్లాలకు ప్రయాణికులు రవాణా కొనసాగిస్తుంటారు కానీ



సాయంత్రం ఆరు దాటిందంటే అక్కడ దిగాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు సిరిసిల్ల కామారెడ్డి నుండి వెళ్లి వచ్చే గంభీరావుపేట ప్రజలు పెద్దమ్మ స్టేజి వద్ద దిగి వస్తుంటారు పక్కనే ఉన్న దమ్మన్నపేట తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు అక్కడికి చేరుకొని వారి వారి గ్రామాలకు వెళ్తుంటారు కానీ రాత్రి వేళలో అక్కడ నుండి వెళ్లాలి అంటేనే ప్రజలు విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు అసలే



చుట్టూ అడవితో కూడుకున్న వైనం మరోపక్క లైట్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు ఇప్పటికైనా అధికారులతో పాటు నాగంపేట దమ్మన్నపేట జగదంబ తండాకు గ్రామాలకు సంబంధించిన సర్పంచులు ప్రత్యేక చొరవ తీసుకొని హైమస్ లైట్లను పునర్నిర్మాణం చేసేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు

# పాత తలుపు రూపంలో మృత్యువు వెల్దుర్తిలో ఏడేళ్ల బాలిక దుర్మరణం

**-వెల్దుర్తి ఎస్ఐ కరుణాకర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.**

వెల్దుర్తిమండలం,ఆగస్టు 10 (సాక్ష్యం):

పాత తలుపు, డోర్ ఫ్రేమ్‌పై ఎక్కేందుకు ప్రయత్నించిన ఏడేళ్ల బాలికపై తలుపు పడటంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన విషాద ఘటన వెల్దుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి గ్రామపంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న ఆశాల యేసు కుమార్తె అలేఖ్య (7) సోమవారం ఉదయం ఇంటి బయట ఆడుకుంటోంది. ఈ సమయంలో ఇంటి పక్కన ఉంచిన పాత తలుపు, డోర్ ఫ్రేమ్‌పై ఎక్కేందుకు చిన్నారి ప్రయత్నించింది.



ఒక్కసారిగా ఆ తలుపు డోర్ ఫ్రేమ్‌తో సహా చిన్నారిపై పడిపోవడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి.



విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలికను చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. ఈ ఘటనపై తనకు ఎలాంటి అనుమానాలు లేవని బాలిక తండ్రి యేసు పోలీసులకు తెలిపారు. వెల్దుర్తి ఎస్ఐ కరుణాకర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె అనుకోని ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చిన్నారి మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో నేరాల నియంత్రణకు తగు చర్యలు

**-అంతర్రాష్ట్ర పోలీస్ అధికారుల సమన్వయ సమావేశం**

మధిర, తెలంగాణ పత్రిక; ఆగస్టు 10: ఖమ్మం సి పి సునీల్ దత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం మధిర పట్టణ పోలీస్ స్టేషన్ లో తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల పోలీస్ అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ఇసుక అక్రమ రవాణా, జూదం,గేమింగ్ కార్యకలాపాల అరికట్టేందుకు ఇరు రాష్ట్రాల పోలీస్ అధికారుల సమన్వయం గురించి చర్చించటం జరిగింది.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా పోలీసు అధికారులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా పోలీసు అధికారులు పాల్గొని, ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఎదురవుతున్న వివిధ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా, దొంగతనాలు, జూదం , అక్రమ గేమింగ్ కార్యకలాపాలు, నేరస్తుల కదలికలు, అంతర్రాష్ట్ర నేరాలకు సంబంధించిన కేసులు తదితర అంశాలపై ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పరం సమాచారాన్ని పంచుకోవాలని నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల్లో నేరాలకు పాల్పడే వ్యక్తులు, గతంలో నేరాలకు



సంబంధించిన వ్యక్తులు, దొంగతనాలకు పాల్పడే నేరస్తులు, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులు, జూదం,గేమింగ్ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని పరస్పరం షేర్ చేసుకుంటూ, సమన్వయంతో నిఘా,తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే సరిహద్దు ప్రాంతాలను ఆసరాగా చేసుకొని నేరస్తులు ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వెళ్లి నేరాలకు పాల్పడకుండా ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సహకారంతో చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచడంతో పాటు, అక్రమ రవాణా, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, నేరాలను నియంత్రిస్తూ ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఇరు రాష్ట్రాల పోలీసులు నిరంతరం పరస్పర సమాచార మార్పిడి చేసుకుంటూ సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో వైరా ఏసిపి సారంగపాణి, మైలవరం ఏసిపి రామచంద్ర రావు , మధిర రూరల్ సీఐ డి.మధు, తిరువూరు సీఐ కే.గిరి బాబు, మధిర టౌన్ ఇన్స్పెక్టర్ దోమల రమేష్, వైరా సీఐ వైవీ ప్రసాద్, వైరా సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, మైలవరం సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గానికి శ్రీశైలం గౌడ్ అభినందనలు

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 10: నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బండారి లేఔట్ డివిజన్‌లో ఉన్న పూజిత ఎన్క్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను సోమవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు విద్యాసాగర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను శ్రీశైలం గౌడ్ అభినందించి, శాలువాతో సన్మానించారు. పూజిత ఎన్క్లేవ్ కాలనీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కాలనీకి



అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధి, స్థానికుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని శ్రీశైలం గౌడ్ ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు విద్యాసాగర్‌తో పాటు కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని పలువురు నిర్వహించనున్న శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను శ్రీశైలం గౌడ్‌కు అందజేసి, కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పూజిత ఎన్క్లేవ్ మాజీ అధ్యక్షుడు శరత్, అమర్, బెనర్జీ, రాజు, నరేంద్ర, వెంకట్ రాజు, శ్రీనివాస్ రెడ్డి, ఉదయ్, శివారెడ్డి, శ్రీనివాసులు, రణధీర్, అరవింద్, యాదగిరి, ఏ.కె. రావు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా “జైలు బరో” సిపిఎం నాయకులు అరెస్ట్

మధిర, తెలంగాణ పత్రిక; ఆగస్టు 10: మధిర పట్టణంలో సోమవారం సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన “జైలు బరో” కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు శీలం నరసింహారావు, మందా సైదులు,పాపినేని రామ నరసయ్య, పడకంటి మురళి ఇతర నాయకులు పాల్గొని అరెస్టు కావడం జరిగింది. మొదట సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు స్థానిక ఎండిఓ కార్యాలయం ఎదుట సమావేశం నిర్వహించి పెద్ద సంఖ్యలో హమాలి వర్కర్లు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన వర్కర్లు, అంగన్వాడి టీచర్, వర్కర్లు ఆర్డబ్ల్యూఎస్ వర్కర్లు, ఇతర స్కీం వర్కర్లు, వ్యవసాయ కార్మికులు, రైతులు పాల్గొని తమ డిమాండ్లు సాధన కోసం





నినాదాలు చేశారు, అనంతరం భగత్ సింగ్ విగ్రహం వద్ద బ్రిడ్జి నుండి రాకపోకలను రాస్తారోకో నిర్వహించి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక రైతు వ్యతిరేక వ్యవసాయ కార్మికులకు వ్యతిరేక చట్టాలను చేస్తూ సాధారణ ప్రజలను మరింత పేదలుగా మార్చే కుట్ర చేస్తుందని వారి హక్కులను కాల రాస్తుందని దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా సోమవారం ప్రజాసంఘాలు ఇచ్చినపిలుపులోభాగంగా పెద్దఎత్తునఆందోళననిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరిన్ని పోరాటాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పోలీసుల అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని తెలియజేశారు.

# కార్మికుల హక్కులు కాలరాస్తే ఊరుకోం

**-కేంద్ర విధానాలపై కార్మికుల సమరశంఖం**
**-ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి**
**-కార్పొరేట్ల సేవలో కేంద్రం!**
**-క్విట్ ఇండియా స్ఫూర్తితో సీఐటీయూ ఆధ్వర్యంలో జైల్ భరో**



వెల్దుర్తిమండలం,ఆగస్టు 10(సాక్ష్యం): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జైల్ భరో కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గౌరీ ఆధ్వర్యంలో అమాలి కార్మికులతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గౌరీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాలను పక్కనపెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణకు ప్రోత్సహించడం, కార్మికుల హక్కులను బలహీనపరిచే చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. రైతులు, కార్మికులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించారు.

**నిరసనలో మార్మోగిన నినాదాలు:**

**“కార్మిక రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి!”**
**“కార్పొరేట్లకు అనుకూల విధానాలు మానుకోవాలి!”**
**“ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి!”**
**“రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి!”**
**“వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి!”**

**“కార్మికులు--రైతులు ఐక్యంగా పోరాడాలి!”**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజా సమస్యలపై దృష్టి సారించి కార్మిక, రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జైల్ భరో కార్యక్రమాన్ని కొనసాగిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమాలి కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ నగరపాలక సంస్థ లోని 35వ డివిజన్ లో సిసి రోడ్డు

**-పనులకు శ్రీకారం చుట్టిన మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు**



తెలంగాణ పత్రిక ప్రతినిధి ఆగస్టు 10 కరీంనగర్ కరీంనగర్లో నగర అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తూ నాన్యత ప్రమాణాలను పెంచే దిశగా నగరపాలక సంస్థ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు అడుగులు వేస్తుంది ఇందులో భాగంగా 35 వ డివిజన్లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు అత్యాధునిక ~~~~ సెల్ఫ్ లోడింగ్ కాంక్రీట్ మిక్సర్ యంత్రాన్ని వినియోగిస్తూ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ పనులను ప్రారంభించారు సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే ~~~~ యంత్రం ద్వారా కాంక్రీటు మిశ్రమ నిష్పత్తుల నిర్మాణ ప్రాంతంలోనే కాంక్రీటు సిద్ధం చేయడం వేగవంతమైన సరఫరా వంటి ప్రయోజనాలు లభిస్తాయి దీనివల్ల పనుల అమలు సమయం తగ్గడంతో పాటు నిర్మాణ నాణ్యత కూడా మెరుగుపడుతుందని తెలిపారు ఈ సందర్భంగా మేయర్ పొలగానే శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు ప్రారంభించడం మాత్రమే కాదు నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం అత్యంత విషయం ఆధునిక యంత్ర సాంకేతికతను వినియోగిస్తూ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నాం అని తెలిపారు ఇట్టి కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి సాధవేని సుజాత శ్రీనివాస్ మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్ లో వరుణ యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




మిర్యాలగూడ ప్రతినిధి//ఆగస్టు 10:(తెలంగాణ పత్రిక):- రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, జలాశయాలు, చెరువులు నిండి, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్‌లో నిర్వహించిన వరుణ యాగంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈరోజు నాగార్జునసాగర్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణ యాగం లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుందూరు జానారెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రవ్యాప్తంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, జలాశయాలు, చెరువులు పూర్తిస్థాయిలో నిండి సాగు మరియు తాగునీటి అవసరాలు తీరాలని, రైతులు పండించిన పంటలకు మంచి దిగుబడులు రావాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రైతులు ఆనందంగా ఉండాలని ప్రతి గ్రామం పచ్చదనంతో కళకళలాడాలని భగవంతుడిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.



## సిద్ధలింగ దేవాలయ నిర్మాణానికి సహకరించాలి



**ఆత్మకూరు: ఆగస్టు 10, (తెలంగాణ పత్రిక):**
కాకతీయుల కాలానికి పూర్వము ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ చెరువు పరిసరాల లో స్వయంభువు గా వెలసిన బ్రహ్మసూత్ర సహిత శ్రీ సిద్ధ లింగేశ్వర దేవాలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని దేవాలయ నిర్మాణానికి కమిటీ చైర్మన్ వెన్నపు రెడ్డి రాజిరెడ్డి, నిర్మాణ కమిటీ సభ్యులు తాటిపర్తి మోహను రావు, దగ్గు సమారావు, లక్కరుసు రాజశేఖర్ లు అన్నారు దేవాలయ నిర్మాణ పనుల పర్యవేక్షిస్తున్న సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయంభువుగా వెలసిన శ్రీ సిద్ధ లింగేశ్వరునికి తాత్కాలిక దేవాలయంలో భక్తులు కొలుస్తున్నారని తెలిపారు. దేవాలయ నిర్మాణంలో అనేకమంది భక్తుల పాల్పంచుకుంటున్నారని వారు వివరించారు దేవాలయాన్ని శిఖర భాగం వరకు పూర్తయిందని ఇంకా ధ్వజస్తంభ నిర్మాణము ఆలయ నిర్మాణం ఇంకా మిగిలి ఉన్నదని చెప్పారు ఆలయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వారు అన్నారు. ఇంకా ఈ ఆలయ నిర్మాణాన్ని వరంగల్ దేవాదాయశాఖ డిఇ చిమ్మని రమేష్ బాబు సందర్శించారని వారు వివరించారు. ప్రతి సోమవారం రోజున అభిషేక పూజలు నిర్వహిస్తున్నామని భక్తులు పూజలలో పాల్గొని తరించాలని ఆలయ పూజారి వడ్డేవరం గోపినాథ్ శర్మ అన్నారు. తాత్కాలిక ఆలయం లో నిత్యం పూజలు నిర్వహిస్తున్నామన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

**-హర్ ఘర్ తిరంగా జోనల్ కన్వీనర్ బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్,**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (తెలంగాణ పత్రిక)**
భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని ఈ నెల 10 వ తేదీ నుండి 15 తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా జోనల్ కన్వీనర్ రావుల రాంనాథ్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారు. ప్రతి పౌరుడిలో దేశభక్తిని పెంపొందించడం, త్రివర్ణ పతాకం పట్ల గౌరవాన్ని చాటడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ప్రతి ఇల్లు, ప్రభుత్వ కార్యాలయం, పాఠశాల, దుకాణ సముదాయాలపై జాతీయ జెండాను ఆవిష్కరించాలి. తమ తమ మొబైల్ ఫోన్ల లో సామాజిక మాధ్యమాల్లో ప్రొఫైల్ లో జాతీయ జెండాను పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 13 న జిల్లా కేంద్రంలో తీరంగా ర్యాలీ సైతం నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి బీజేపీ శాసన సభాపక్ష నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథి గా హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, పట్టణ కౌన్సిలర్లు గంజి రాజు, జింక సూరి , శ్రీరామోజీ నరేష్, సూరజ్, అర్జున్, సాత్విక్, జిల్లా బీజేవైఎం అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, నాయకులు భరత్, విజయ్, దీక్షిత్, చరణ్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినరైతు కూలీ సంఘం

**కామారెడ్డి ,ఆగస్టు 10,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**



స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందంపై దేశ ప్రధాని మోడి సర్కార్ సంత కాలు చేయవద్దని సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు మేరకు సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రైతుకూలి సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలుపడం కార్యక్రమంలో పాల్గొన్న సంఘం జిల్లా కార్యదర్శి. పిరంగి రాజేశ్వర్, శ్రామికశక్తి బీడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాకార్యదర్శి అనసుయ, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షులు వెంకట లక్ష్మి, బహుజన దళిత పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర శివరాజు, జిల్లా అధ్యక్షులు సబ్బని స్వామి, మల్లేష్, బాలయ్య, రేణుక, భారతి, కలక్క మరియు ఇతరులు పాల్గొన్నారు

# చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

**-సీపీఐ మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ**

**తెలంగాణ పత్రిక దమ్మపేట ఆగస్టు 10**




దమ్మపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సెప్టెంబర్ 1న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ పిలుపునిచ్చారు. ఆగస్టు 6 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలను విజయవంతం చేయాలని కోరారు. దమ్మపేటలోని సీపీఐ కార్యాలయంలో కోకలకుంట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ధర్మ మాట్లాడుతూ.. బీజేపీ పదేళ్ల పాలనలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, కార్మికుల సమస్యలు, గ్రామీణ ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమయ్యాయని విమర్శించారు. నిత్యావసరాలు, వంటగ్యాస్, విద్యుత్, వైద్యం, విద్య ఖర్చులు 8పెరగడంతో సామాన్య ప్రజలపై భారం పడుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం "బద్లావ్ జరూరీ హై--మార్పు కావాలి" నినాదంతో సీపీఐ చేపట్టిన ఉద్యమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ ఈశ్వరరావు, కోకలకుంట సత్యనారాయణ, ఎస్కే జాన్ బీ, నక్క నాగమణి, గాజుబోయిన కృష్ణవేణి, మెరుగు వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా లో జైల్ భరో జయవంతం



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (తెలంగాణ పత్రిక)**
ఈరోజు అంబేద్కర్ విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం రాస్తారోకో 2 గంటల పాటు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధకరేలి మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూల, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తున్నది. ఎందరో పోరాట యోధుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్ర్యాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతున్నారు. నాడు బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పోరేట్ పెట్టుబడిదారులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా నేడు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు పోరాడాలి. క్విట్ ఇండియా స్ఫూర్తితో భారతదేశాన్ని కాపాడుకోవాలి. బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణలను దుందుడుకుగా అమలు చేస్తున్నది. అందులో భాగంగానే లేబర్ కోడ్ల అమలుకు ఫైనల్ రూల్సు నోటిఫై చేసింది. విద్యుత్ సవరణ బిల్లు-2025, విత్తన చట్టానికి సవరణలు ప్రతిపాదించారు. సులభతర వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పేరుతో పెట్టుబడిదారుల గరిష్ట లాభాల కోసం కార్మిక చట్టాలను రద్దు చేసింది. రోజువారి పని దినాన్ని 8 గంటల నుండి 12 గంటలకు పెంచుకునేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. సమ్మె హక్కును కాలరాస్తూ ఆంక్షలు విధించారు. కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్లు కష్టతరం చేశారు. ఉద్యోగ భద్రతను పాతర వేశారు. 300 మంది లోపు పనిచేసే కంపెనీలో కార్మికులను ఎప్పుడైనా నోటీసు లేకుండా తొలగించేందుకు "హైర్ & ఫైర్" విధానాన్ని తెచ్చారు. వేతనాల కోడ్లో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడారు. సామాజిక భద్రతా కోడ్, వృత్తి సంబంధిత రక్షణ, ఆరోగ్యం-పని పరిస్థితుల కోడ్లతో భవన నిర్మాణ, హమాలీలు, ట్రాన్స్పోర్ట్, బీడీ తదితర అసంఘటితరంగ కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. పిఎఫ్, ఇఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులపై గొడ్డలి వేటు వేశారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకెపి వివోఏ, ఫీల్డ్ అసిస్టెంట్, ఆరోగ్య శాఖలలో వివిధ స్కీంలో కోటిమంది వర్కర్లు పనిచేస్తున్నారు. వీరు ఉద్యోగ భద్రత, కనీస వేతనానికి నోచుకునే స్థితి లేదు. లేబర్ కోడ్స్ అమలైతే తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు, కార్మికవర్గం కోల్పోతాము. 4 లేబర్ కోడ్లను ఉపసంహరించుకునే వరకు పోరాడుదాం. కే రాజన్న, టి యు సి ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ, అమెరికా, బ్రిటన్, న్యూజిల్యాండ్లతో కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నది. భారత వ్యవసాయ రంగంలోకి 32 దేశాల నుండి దిగుమతులను ప్రోత్సహించారు. జీరో సుంకంతో దిగుమతులు రావడంతో దేశీయ వ్యవసాయోత్పత్తుల ధరలు తగ్గిపోయి రైతులు దివాళా తీస్తున్నారు. గత డిసెంబర్లో పత్తిపై ఉన్న 11 శాతం సుంకం తగ్గించి 40 లక్షల బేళ్ల పత్తిని అదనంగా దిగుమతి చేసుకోవడంతో దేశంలో పత్తి ధరలు పడిపోయాయి. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూరాయి. భారతదేశంలో ఏటా 18 లక్షల కోట్ల వ్యవసాయోత్పత్తులు మార్కెట్కు వస్తుందగా, కనీస మద్దతు ధరలు అమలు జరగకపోవడం వల్ల రైతులు ఏటా రూ.4 లక్షల కోట్లు నష్టపోతున్నట్లు ప్రముఖ ఆర్థికవేత్త అశోక్ గులాటి ప్రకటించారు. వ్యవసాయోత్పత్తుల వ్యయంపై 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయిస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం ఉత్పత్తి ధరను తగ్గించి నిర్ణయించడం వల్ల గిట్టుబాటు ధర రావడం లేదు. కనీస మద్దతు ధరల చట్టాన్ని పార్లమెంట్లో ఆమోదించాలని ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. రుణవిమోచన చట్టం చేయాలని కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం చేయడం లేదు. రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు, పంట రుణాల సౌకర్యం, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం, బీమా సౌకర్యం కల్పించాలి. వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో "మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ చట్టం-2005" రూపొందింది. దీని ప్రకారం వ్యవసాయ కార్మికులకు సం॥లో 100 రోజుల పని కల్పించాలి. ప్రస్తుతం రోజుకు రూ.308/-లు చెల్లిస్తున్నారు. దేశంలో మొత్తం వ్యయంలో 90 శాతం కేంద్రం, 10 శాతం రాష్ట్రాలు భరించాలి. ఈ పథకానికి ఏటా 2,6 లక్షల కోట్లు పెంచాలని ఆందోళన జరుగుతుండగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసింది. మహాత్మాగాంధీ పేరు తొలగించి "వికసిత్ భారత్ (గ్రామ్ జి" పేరు (విబిజి రామ్ జి)గా మార్పు చేయడమే కాక, రాష్ట్రాల వాటా 10 శాతం నుండి 40 శాతం నిధులను భరించాలని నిర్ణయించింది. సమైక్య పోరాట ద్వారా ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలి. పేదలకు అందుతున్న అంత్యోదయ ఆహార భద్రతపై వేటు వేయబోతుంది. అంత్యోదయ పథకం ద్వారా నిరుపేదలకు ప్రతి కుటుంబానికి 35 కేజీల బియ్యం లేదా గోధుమలు ఇస్తున్నారు. ఇప్పుడు ఇచ్చే 35 కేజీల బియ్యాన్ని రద్దు చేసి ఒక్కొక్క మనిషికి 7 కేజీలు మాత్రమే ఇవ్వాలని ఆహార భద్రతా చట్టానికి సవరణలు తీసుకొస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 5.67 లక్షల కుటుంబాలు 15.29 లక్షల లబ్ధిదారులు ఉన్నారు. వీరిపై తీవ్ర ప్రభావం ఉంటుంది. అంత్యోదయ సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలి. ప్రతి కుటుంబానికి ప్రస్తుతం ఇస్తున్న 35 కిలోల బియ్యాన్ని యథాతథంగా కొనసాగించాలి. విద్యుత్ ఉత్పత్తి రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర జాబితాలో ఉన్నది. దాన్ని గత పార్లమెంట్ సమావేశాల్లో "2025 విద్యుత్ సవరణ బిల్లు"గా ఆమోదించడం జరిగింది. ఈ చట్ట ప్రకారం ఇక నుండి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ బాధ్యతలు కేంద్రం చూస్తుంది. విద్యుత్ ఛార్జీలను కూడా కేంద్రమే "విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్" ద్వారా నిర్ణయిస్తుంది. స్మార్ట్ మీటర్లు పెట్టి టారిఫ్ ముందుగానే వసూలు చేస్తారు. ఉచిత విద్యుత్ రద్దు చేస్తారు. క్రాస్ సబ్సిడీ రద్దు చేయడం వల్ల వినియోగదారులందరు ఉత్పత్తి ఖర్చు చెల్లించాలి. విదేశాల నుండి విద్యుత్తు దిగుమతి చేసుకోవచ్చు, దీంతో రాష్ట్రాల హక్కులు పూర్తిగా హరించబడతాయి. సాంప్రదాయ విద్యుత్ (సోలార్) వినియోగం పేరుతో ఛార్జీలు పెంచుతారు. ప్రస్తుతం దేశంలో లక్ష కోట్లు విద్యుత్ బాకీలు ఉన్నాయి. ఇవి మరింత పెరుగుతాయి. ఉత్పత్తి, సరఫరా, పంపిణీ ప్రైవేట్ సంస్థలు హస్తగతం చేసుకొని లక్షల కోట్ల లాభాలు సంపాదిస్తాయి. అందుకని పార్లమెంట్ ఆమోదించిన విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కామ్ను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ కొత్త డిస్కామ్కి భారీగా పెట్టుబడి, మౌలిక సదుపాయాలు అవసరమౌతాయి. సిబ్బంది, నిర్వాహణ భారం పెరుగుతుంది. కానీ అందుకు తగిన బడ్జెట్ కేటాయింపులు చెయ్యలేదు. తెలంగాణలో వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. భవిష్యత్తో ప్రభుత్వ సబ్సిడీకి గ్యారంటీ లేదు. సకాలంలో ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకుంటే ఈ డిస్కామ్ దివాళా తీస్తున్నది. రైతులకు నాణ్యమైన కరెంటుకు గ్యారంటీ ఉండదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా విద్యుత్తు ప్రైవేటీకరించం, మోటర్లకు మీటర్ బిగించం అని చెబుతున్నప్పటికీ, ఈ సంక్షోభం నుండి బయట పడేందుకు భవిష్యత్తో వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టడం లేదా చార్జీలు పెట్టడం (పెంచడం) నిర్ణయాన్ని విరమించుకోవాలి. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి, బొమ్మెన.సురేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.గంగమని, ఉపాధ్యక్షులు +.కిషన్,బి. సుజాత, జిల్లా సహాయ కార్యదర్శులు శైలజ. రాధా, జిల్లా కమిటీ సభ్యులు మల్లేష్, కధశీ.బాబు, చంద్రకళ,కమల, లక్ష్మి, సుగ్న, ఇంద్రళ,సాధ, గీత,రాజమణి, టి యు సి ఐ జిల్లా కార్యదర్శి రామ లక్ష్మణ్,అధ్యక్షులు బక్కన్న, నాయకులు గంగాధర్ ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి హరిత, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం. నూతన కుమార్, డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్.నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుంచుల నారాయణ,బర్కుంట గంగారం ఉప సర్పంచ్, నాయకులు చింతకుంట శంకర్ అధ్యక్షులు ఇప్ప లక్ష్మణ్, అఖిలభారత రైతు కూలి రాష్ట్ర నాయకులు రాజు, రైతు కూలి సంఘం జిల్లా నాయకులు దేవా భోజన్న, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తోడసం శంభు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి, పిఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎల్ ఆర్ ఉపాలి పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శిసింగరి వెంకటేష్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కన్వీనర్ దిగంబర, పి డి ఎస్ యు రాష్ట్ర కోశాధికారి మహేందర్,లి తదితరులు పాల్గొన్నారు



# మస్కట్ లో మృతి చెందిన మృతదేహంను తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి అండతో స్వదేశానికి తరలింపు







గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 10

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం, నర్మాల గ్రామా వాసి గరిగంటి శ్రీహరి (45) గత 10 సంవత్సరాలుగా ఒమన్‌లోని ఒక ప్రైవేట్ కంపెనీలో కన్స్ట్రక్షన్ వర్కర్ గా విధులు నిర్వహిస్తున్నాడు కంపెనీ సరైన సమయంలో జీతాలు చెల్లించకపోవడం జీతాల విషయంలో ఇబ్బందులు ఎదురవడంతో అత్యవసర సెలవుపై స్వదేశానికి వెళ్లారు సెలవు ముగించుకొని మూడు నెలల అనంతరం తిరిగి మస్కట్ వచ్చిన శ్రీహరి, గతంలో పనిచేసిన కంపెనీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా (చట్టవిరుద్ధంగా) మరో కంపెనీలో పని చేయడం ప్రారంభించారు. ఒమన్‌లో స్థానికంగా దీనిని "కల్లివెల్లి" అని అంటారు. స్పాన్సర్‌కు తెలియకుండా మరో కంపెనీలో పనిచేయడం ఒమన్ కార్మిక చట్టాల ప్రకారం నిబంధనలకు విరుద్ధం. శ్రీహరి మరో కంపెనీలో విధులు నిర్వహిస్తూ ఉండగా తేదీ 29/07/2026 బుధవారం ఒక్కసారిగా తీవ్రంగా చెమటలు రావడంతో అస్వస్థకు గురయ్యారు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా, వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని తోటి కార్మికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చట్ట విరుద్ధంగా మరో కంపెనీలో పనిచేసిన శ్రీహరి మృత దేహాన్ని స్వదేశానికి పంపడానికి ప్రభుత్వ అధికారులు, అలాగే గతంలో పనిచేసిన మొదటి కంపెనీ స్పాన్సర్ కూడా మృతదేహం తరలింపు బాధ్యత తీసుకోవడంలో వెనుకంజ వేశారు. ఈ విషయాన్ని శ్రీహరి కుటుంబ సభ్యులు తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి-టీజీ డబ్ల్యూడబ్ల్యూసి మస్కట్ కోఆర్డినేటర్ గోగు దేవరాజు కు తెలియపరిచారు. దేవరాజు వెంటనే టీజీ డబ్ల్యూ డబ్ల్యూ సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలాజీ శ్రీనివాస్ కు సమాచారం అందించి ఇద్దరూ భారత రాయబార కార్యాలయం, సంబంధిత అధికారులు శ్రీహరి గతంలో పనిచేసిన మొదటి స్పాన్సర్‌తో సంప్రదింపులు జరిపారు. చట్టపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ మానవతా దృక్పథంతో శ్రీహరి మృతదేహాన్ని స్వదేశానికి పంపేందుకు సహకరించాలని స్పాన్సర్ను కోరారు. వారి విజ్ఞప్తికి స్పందించిన సంబంధిత అధికారులు అవసరమైన పత్రాలు సిద్ధం చేయడంలో సహకరించడంతో, శ్రీహరి మృతదేహాన్ని అతి తక్కువ సమయంలో స్వదేశానికి తరలించడం జరిగిందిని పాలజీ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా పాలాజీ శ్రీనివాసు, గోగు దేవరాజు, మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న గల్ఫ్ కార్మికు ల కుటుంబాలకు అండగా నిలవడమే టీజీ డబ్ల్యూ డబ్ల్యూసి లక్ష్యం మానవతా దృక్పథంతో ప్రతి కుటుంబానికి సాధ్యమైనంత సహాయం అందిం చేందుకు టీజీ డబ్ల్యూడబ్ల్యూసి ఎల్లప్పుడూ ముందు ంటుంది అని అన్నారు అన్ని విధాల సహకరించిన ఇండియన్ కౌన్సిలేట్ మస్కట్ కి మృతిని కంపెనీ స్పాన్సర్కు కు (ఆర్ ఓ పి) మెడికల్ డిపార్ట్మెంట్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అలాగే తెలంగాణ సచివాలయంలోని ఎన్నారై విభాగంతో సంప్రదించి హైదరాబాద్ విమానాశ్రయం నుండి స్వగ్రామానికి ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయించామని తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించిన ప్రభుత్వానికి అలాగే చట్టపరమైన ఇబ్బందులను అధిగమించి, శ్రీహరి మృతదేహాన్ని త్వరితగతిన స్వదేశానికి తీసుకురావడానికి కృషి చేసిన టీజీ డబ్ల్యుడబ్ల్యుసి మస్కట్ కోఆర్డినేటర్ గోగు దేవరాజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలాజీ శ్రీనివాస్, ఒమన్ శాఖ అధ్యక్షులు జావుడల సత్తన్నను శ్రీహరి కుటుంబ సభ్యులు గ్రామస్తులు టీజీ డబ్ల్యూ డబ్ల్యూ సి సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో పాపన్నపేట పంచాయితీ సిబ్బంది మృతి

-ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు డీ

-పాపన్నపేట పంచాయితీ సిబ్బంది దుర్మరణం

పాపన్నపేట, ఆగస్టు 10:(తెలంగాణ పత్రిక)





ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు డీ కొన్న ఘటనలో పాపన్నపేట పంచాయితీ సిబ్బంది దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. పాపన్నపేట గ్రామానికి చెందిన ఆకుల కృష్ణ (40) పాపన్నపేట పంచాయితీ కార్యాలయంలో కారోబార్ గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై బంధువైన వెంకట్ తో కలిసి కొత్తపల్లి వైపు నుంచి పాపన్నపేట వైపు వెళుతున్నాడు. ఇదే క్రమంలో ముస్లాపూర్ గ్రామానికి చెందిన కటికే వారు ఇరువురు ద్విచక్ర వాహనం పై ముస్లాపూర్ నుండి మెదక్ వైపు వెళుతున్నారు. యూసుఫ్ పేట గ్రామ శివారు లోకి రాగానే రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుగా ఢీ కొనడంతో రోడ్డుపై పడ్డారు. కృష్ణ తలకు తీవ్ర గాయాలు కావడంతో తీవ్ర రక్త స్రావం అయింది. ఈ విషయం గమనించిన స్థానికులు వెంటనే 108, పాపన్నపేట పోలీసులకు సమాచారం అందివ్వడంతో హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండంగా మార్గమధ్యంలోనే కృష్ణ మృతి చెందినట్లు పరీక్షించిన డాక్టర్లు నిర్ధారించారు. కాగా మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. ఈ సంఘటనతో పాపన్నపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించాలి తాండ్ర సదానందం

ఓదెల ఆగస్టు 10 తెలంగాణ పత్రిక





కేంద్రంలోని ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు, రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా సుల్తానాబాద్ నుండి పోత్కపల్లి గ్రామం వరకు సాగింది కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ ప్రజా చైతన్య యాత్ర లో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ తో కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా పోత్కపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి, యువజన, మహిళ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి భారత కమ్యూనిస్టు పార్టీ తీసుకున్న దేశవ్యాప్త నిరసన ఉద్యమంలో భాగంగా ప్రజా చైతన్య యాత్ర ను ప్రారంభించడం జరిగిందన్నారు, దేశంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని, విద్యార్థులకు చదువుకునే హక్కు లేకుండా పేపర్ లీకేజీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తూ విద్యార్థుల భవిష్యత్తు తో చెలగాటం ఆడుతుందని మండిపడ్డారు, ఈ కార్యక్రమం లో రాష్ట్ర, జిల్లా నాయకులు మండల కార్యదర్శి కోడం స్వామి తోపాటు పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

## జైల్ బరోతో దద్దరిల్లిన కామారెడ్డి

-అడుగడుగునా పోలీసుల అరెస్టులు తీవ్ర ఉద్రిక్త పరిస్థితి

-అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

-సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్

కామారెడ్డి , ఆగస్టు 10, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



లేబర్ కోర్డుల రద్దు పాత కార్మిక చట్టాల అమలు కోసం వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం శాంతియుతంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో జైలు బరో కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు అరుణ్ ప్రజా సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసి కేంద్ర ప్రభుత్వానికి కామారెడ్డి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని తేటతెల్లమైందన్నారు ఈ దేశంలో రైతులు కార్మికులు ప్రజలు ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఆ హక్కులు కోల్పోయే విధానాలు అమలు చేసేవే లేబర్ కోడులన్నారు భారత రాజ్యాంగాన్ని హాజరు పరిస్థితి దానికి వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వం 12 సంవత్సరాల నుండి 85 ఏళ్ల ముసలి వాళ్ళని సైతం చట్టాన్ని ధిక్కరిస్తున్నారు అనే సాకుతో నరహత్యలకు పాల్పడుతుందన్నారు ఒకపక్క రాముని పేరుతో దేవుడు గుళ్లను దోపిడీ చేస్తూ మరోపక్క ప్రజల ప్రాణాలు తీస్తూ పదాన్ని అంబానీలకు దేశ సంపదను భూమిని భూమిలో ఉన్న ఖనిజ సంపదనం దోచిపెడుతుందని దానికి అడ్డుగా ఉన్న ప్రశ్నించిన మేధావులు ప్రజలపై దేశద్రోహం కేసులు పెడుతూ భారత పౌరులపై భారత పౌరులను ఉపయోగించి హత్యలు చేయిస్తుందని విమర్శించారు ఇప్పటికే భారత ప్రభుత్వ ఆస్తులు సగానికి పైగా అమ్మేసి భారత రాజ్యాంగం రద్దుకు కుట్ర జరుగుతుంది అన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొత్త నరసింహులు వెంకటి సిఐటియు నాయకులు రాజనర్సిం ముదాం అరుణ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్ల మోహన్ మున్సిపల్ యూనియన్ నాయకులు మహబూబ్ నర్సింగరావు సంతోష్ దీవెన శివ రాజవ్వ అంగన్వాడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబాయమ్మ ఇందిరా లక్ష్మి ఆశ యూనియన్ నాయకులు రాజశ్రీ మమత గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బాల్నర్సు మాచరెడ్డి బాలనరు స్వామి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక, రైతు హక్కులపై కేంద్రం దాడి

-కార్పొరేట్ల సేవలో మోదీ ప్రభుత్వం.. రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్‌భరో

కొత్తగూడెం, ఆగస్టు 10: (తెలంగాణ పత్రిక)






కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా దాడి చేస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి, నాయకులు సురేందర్ ఊక్లా, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విశ్వం శెట్టి, పూర్ణచంద్రరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి జలీల్, ఏఐపీకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జాటోత్ కృష్ణ ఆరోపించారు. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్‌లో జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించే వ్యవసాయ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. దేశంలోని బొగ్గు బ్లాకులు, అటవీ సంపద, రైల్వేలు, రోడ్లు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ప్రమాదకరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, బీబీజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం చేయాలని, కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడాలని, లేదంటే మోదీ ప్రభుత్వం గద్దె దిగాలని నినాదాలు చేశారు. జీడీపీ పెంచుతామని అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారాన్ని మోపిందని నాయకులు విమర్శించారు. సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులను నిరాకరిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. భారీగా అరెస్టులు కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్‌లో వందలాది మంది రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు రహదారిపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో పోలీసులు ఆందోళనకారులను, సంఘాల నాయకులను అరెస్టు చేసి త్రీటౌన్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నారాటి ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సీతారామయ్య, టీయూసీఐ నాయకులు గోపాలరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, ఎస్‌కేఎం నాయకులు అమర్లపూడి రాము, మధు, సీఐటీయూ నాయకులు లిక్కి బాలరాజు, భూక్య రమేష్, దొడ్డ రవి, సత్య, ఏఐకేఎస్ నాయకులు కొండబోయి వెంకటేశ్వర్లు, కోబల్, కున్సోత్ ధర్మ, వీర్ల రమేష్, తిరుపతిరావు, వెంకట్రావు, తులసిరామ్, ఏఐటీయూసీ నాయకులు జమలయ్య, ఎస్‌కేఎం నాయకులు బుర్ర వెంకన్న, కల్తీ వెంకటేశ్వర్లు, కుమార్, సంజీవ్, ప్రసాద్, ఆదిలక్ష్మి, మంగమ్మ, ఉమ, జ్యోతి, లక్ష్మి, ఇందిర, పద్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 10:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బోనాల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. కుత్బుల్లాపూర్ గ్రామం, చింతల్ ప్రాంతాల్లో నిర్వహించిన పాలారం బండి ఊరేగింపు కార్యక్రమాల్లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా నాయకుడు నల్ల జై శంకర్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కుత్బుల్లాపూర్ గ్రామం, చింతల్ ప్రాంతాల్లో భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పులి బలరాంతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# శంకరపట్నంలో తెలంగాణ రాష్ట్ర రక్షణ సమితి పార్టీ జెండా ఆవిష్కరణ

శంకరపట్నం,ఆగష్టు 10:(తెలంగాణ ప్రతీక )



శంకరపట్నం: మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రక్షణ సమితి పార్టీ జెండాను పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి గుంజపడుగు హరీ ప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నైమల చైతన్య, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి లింగంపల్లి నాగరాజు, కరీంనగర్ శాసనసభ ఇన్‌చార్జి అంకం శివరాణి, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మజీద్, బుడిగ పరశురాములు, సీనియర్ నాయకులు సల్మా, జైపాల్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మద్యం ముసుగులో మర్డర్ ప్లాన్.. సీసీ కెమెరాలతో గుట్టురట్టు

-వెంకటేశం హత్య కేసులో కుసుమ గణేష్ అరెస్ట్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10, తెలంగాణ పత్రిక



సిరిసిల్ల పట్టణంలో సంచలనం రేపిన వెంగల వెంకటేశం (50) హత్య కేసును పోలీసులు ఛేదించారు. బీవై నగర్‌కు చెందిన కుసుమ గణేష్ (51)ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఆగస్టు 6న వెంకటేశం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతని భార్య సులోచన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు వెంకటేశంతో కలిసి తిరిగిన కుసుమ గణేష్‌ను గుర్తించారు. ఆగస్టు 8న రగుడు శివారులో వెంకటేశం మృతదేహం లభించడంతో దర్యాప్తు మరింత వేగవంతమైంది. విచారణలో వెంకటేశంతో పని విషయంలో ఏర్పడిన విభేదాల కారణంగా గణేష్ అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. నైట్రాప్ పొడిని విస్కీలో కలిపి వెంకటేశానికి తాగించగా, కొద్దిసేపటి తర్వాత అతడు కిందపడిపోయినట్లు వెల్లడైంది. అనంతరం వెంకటేశం మృతి చెందినట్లు భావించిన గణేష్ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ హత్య వెనుక రాజకీయ కోణం కూడా ఉన్నట్లు అనుమానిస్తున్న పోలీసులు, ఇప్పటికే మరికొందరిని అదుపులోకి తీసుకుని వారి పాత్రపై విచారణ కొనసాగిస్తున్నారు. నిందితుడి నుంచి మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లు, నైట్రాప్, విస్కీ బాటిల్, దుస్తులు, క్యాప్, మృతుడికి సంబంధించిన పేపర్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి

కామారెడ్డి ,ఆగస్టు 10, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతి నిధి)



ఓటర్ల వివరాల ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత అని కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) కామారెడ్డి జిల్లాలో విజయవంతంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. జిల్లాలోని జుక్కల్, యెల్లారెడ్డి, కామారెడ్డి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 796 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 6,96,006 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల ముద్రణ, పంపిణీ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ వెల్లడించారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సమగ్రంగా నమోదు చేయడం ద్వారా ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

**నియోజకవర్గాల వారీగా వివరాలు**

జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గం: 2,06,343 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు 90.27 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది. యెల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం: 2,28,503 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. 90.17 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం: 2,61,160 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. 83.96 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది.

**జిల్లా స్థాయి గణాంకాలు**

జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,96,006 మంది ఓటర్లు ఉండగా, అందరికీ ఎన్నికల ఫారాల ముద్రణ, పంపిణీ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు 6,11,568 ఎన్నికల ఫారాలు, అంటే 87.87 శాతం డిజిటైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 796 మంది బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించిన శిక్షణను పూర్తిగా పొందారు. 84,438 ధృవీకరణ కాని ఎన్నికల ఫారాలు నమోదు చేసినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, ఇప్పటికే మరోచోట నమోదు అయిన వారు, గైర్హాజరైన ఓటర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వర్గీకరణలను స్పష్టంగా నమోదు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

**ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించాలి**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం ప్రతి ఓటరు మరోసారి తమ పేరు, చిరునామా, వయస్సు, ఇతర ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. తమ వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నా, పేరు లేకపోయినా లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నా, నిబంధనల ప్రకారం సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి సవరణలు, అభ్యంతరాలు నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అర్హులైన ప్రతి ఓటరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం సరిచేసే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**ఓటర్లు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలి**

ప్రతి ఓటరు తమ ఓటరు జాబితాలోని పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఓటర్ల నుంచి బూత్ స్థాయి అధికారులు సేకరించిన వివరాలను విధివిధానాల ప్రకారం డిజిటైజ్ చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో కృషి చేసిన ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకతను నిర్ధారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# జైల్ భరో కార్యక్రమంలో జూలకంటిని అరెస్ట్ చేసిన పోలీసులు





-స్వదేశీ సంపదను కార్పొరేట్లకు అమ్ముతున్న మోడీ

-ఏఐకేఎస్ జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ ప్రతినిధి//ఆగస్టు 10:(తెలంగాణ పత్రిక):-

దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దార దత్తం చేస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ విధానాలను వ్యతిరేకించి సంపాదన కాపాడుకోవాలని ఏఐకేఎస్ జాతి నాయకులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సోమవారం నాడు జైల్ భరో కార్యక్రమం సందర్భంగా స్థానిక బస్టాండ్ ముందు సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమము రెండు గంటల పాటు జరిగింది. ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది అన్న ఉద్దేశంతో పోలీసులు ధర్నా చేస్తున్న జూలకంటి తో పాటు ఆయా సంఘాల నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తుంది అన్నారు. నాటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్రం కొరకు సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులకు మతోన్మాదులకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణలను అమలు చేస్తూ ఉందని అందులో భాగంగానే లేబర్ కోడ్ల అమలుకు ఫైనల్ రూల్స్ ను నోటిఫై చేసిందని అన్నారు. సులభతర వ్యాపారం పేరుతో పెట్టుబడిదారుల గరిష్ట లాభాల కోసం కార్మిక చట్టాలను రద్దు చేసిందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాలను 12 గంటలకు పెంచుకునేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని అన్నారు. అంతే కాక కార్మికుల ప్రాథమిక హక్కు అయినా సమ్మెను కాలరాస్తూ దానిపై ఆంక్షలు విధించడమే కాక కార్మిక సంఘాల గుర్తింపు రిజిస్ట్రేషన్ కష్టతరం చేసింది అని అన్నారు. వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ పథకాన్ని నీరు గార్చే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేష్ నాయకులు రవి నాయక్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి వినోద్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమేష్, చేనేత కార్మిక సంఘం నాయకులు భావండ్ల పాండు ఐద్వా నాయకురాలు గోవర్ధన, అరుణ, సైదమ్మ, అనసూర్య, హమపక్ష రైతు సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, వసుక్కుల మట్టయ్య టాప్రా నాయకులు జగదీష్ చంద్ర, సత్యనారాయణ రావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్ర నాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్ నాయక్, సైదా నాయకులు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న పంటలకు వర్ధ కాలవ నీళ్లు విడుదల చేయాలి!

-యాగాలతో నీళ్లు రావు.. మోటార్లు ఆన్ చేస్తేనే వస్తాయి

-బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నిమ్మల నవీన్ రెడ్డి డిమాండ్

మాడుగులపల్లి//నల్గొండ//ఆగస్టు 10:(తెలంగాణ పత్రిక):-



నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలంలో సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు వర్ధకాలవ ద్వారా తక్షణమే నీటిని విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నిమ్మల నవీన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో నీటి ఎద్దడి వల్ల పరిస్థితి అత్యంత అద్వానంగా తయారైందని, పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు అయ్యా ముఖ్యమంత్రి రైతుల ఆక్రోశాన్ని అర్థం చేసుకోండి యాగాలు చేసినంత మాత్రాన కాలవల్లోకి నీళ్లు రావు, లిఫ్ట్ మోటార్లు ఆన్ చేస్తేనే నీళ్లు వస్తాయి అని ఘాటుగా విమర్శించారు. ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో మోటార్లు స్టార్ట్ చేసి, వర్ధకాలవ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటిని పారించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. నీటిని వెంటనే విడుదల చేయకపోతే రైతుల తరపున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143